APTEL 2009/31957

# నీలగిరి వార్త

మన కోసం మన వార్త తెలుగు దినపత్రిక

neelagirivartha@gmail.com

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎడిటర్ : గుంటోజు విష్ణుమూర్తి సంపుటి 20 సంచిక 40 ఆదివారం 25 అక్టోబర్ 2026 పేజీలు 8 వెల- 5 రూ

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో

## రక్తదాన శిబిరం



## రోడ్డుపై షెడ్లు, ప్రయాణికులకు అవస్థలు



3లో

## ఎంబీబీఎస్ ఉత్తీర్ణతలో ప్రభుత్వ వైద్య కళాశాలల ముందంజ



మిగతా 2లో

- ప్రభుత్వ కళాశాలల్లో 88.11 శాతం.. ప్రైవేటు కళాశాలల్లో 80.68 శాతం ఉత్తీర్ణత
- ప్రభుత్వ సిద్దార్థ, ఆంధ్ర వైద్య కళాశాలలు, తిరుపతి, పాడేరు కళాశాలల్లో మెరుగైన ప్రతిభ
- వరుసగా ప్రభుత్వ కళాశాలల్లోనే అధిక ఉత్తీర్ణత

## అమెరికన్ల హత్యకు ఇరాన్ కుట్ర..

- మిడిల్ ఈస్ట్‌లో యూస్ రాయబార సిబ్బందికి హై అలర్ట్
- అమెరికా దౌత్య సిబ్బందిని లక్ష్యంగా చేసుకున్నట్లు ఇరాన్‌పై ఆరోపణలు
- మిడిల్ ఈస్ట్‌లోని అమెరికా రాయబార కార్యాలయాలకు భద్రత పెంపు
- ఇరాన్--అమెరికా మధ్య తీవ్రంగా మారిన ఉద్రిక్తతలు
- అగ్రనేతల హత్యల నేపథ్యంలో ప్రతీకార చర్యలపై ఆందోళనలు



2లో

## రక్షణ రంగంలో భారతదేశాన్ని అగ్రగామిగా చూడాలనేది ఆకాంక్ష




- రక్షణ పెట్టుబడులు రెండింతలు చేయండి
- ప్రభుత్వం నుంచి ఏం కావాలన్నా ఇస్తా
- త్వరలో రక్షణ, ఏరోస్పేస్ 2.0 పాలసీ
- జీడీపీలో తెలంగాణ వాటా డబుల్ కావాలి
- అందుకు రక్షణ పెట్టుబడులే కీలకం
- ఎగుమతుల్లో దేశం నంబర్ 1 కావాలి
- అందులో తెలంగాణ ముందుండాలి
- ఆయుధ బలంతోనే దేశానికి శాంతి
- రక్షణ ఎక్స్‌పోలో సీఎం రేవంత్ వ్యాఖ్యలు

మిగతా 2లో

హైదరాబాద్, **నీలగిరి వార్త**

ఆయుధ ఎగుమతులు, రక్షణ రంగంలో భారతదేశాన్ని అగ్రగామిగా చూడాలనేది తన ఆకాంక్ష అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దేశ రక్షణ పరిశ్రమకు తెలంగాణ అతిపెద్ద పారిశ్రామిక కేంద్రంగా మారాలని చెప్పారు. యుద్ధానికి అవసరమైన సాంకేతికతను దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ఎగుమతి చేసే స్థాయి దేశం ఎదగాలన్నారు. శనివారం రాత్రి తాజ్ ఫలక్‌నుమా ప్యాలట?సలో జరిగిన 'రక్ష ఎక్స్‌పో-2026' ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీఎం కీలకోపన్యాసం చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రక్షణ పెట్టుబడుల కమిటీ ఛైర్మన్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు,

## కేటీఆర్ ప్రసంగంతో స్ఫూర్తి పొంది అమెరికాలో కంపెనీ ఏర్పాటు

- హైదరాబాద్‌లో ర్యాండమ్ ట్రీస్ భారత దేశ ప్రధాన కార్యాలయం ప్రారంభం
- ఏఐతో ఉద్యోగాలు పోవు.. కొత్త అవకాశాలు సృష్టించుకోవాలి
- మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా యువత ముందుకు సాగాలి
- లోకల్ నుంచి గ్లోబల్ స్థాయికి ఎదుగుతున్న ర్యాండమ్ ట్రీస్
- ప్రపంచ పోటీలో నిలవాలంటే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి
- ఏఐని ఉద్యోగాలు హరించే భూతంలా చూడొద్దు
- అమెరికాలో ఆవిర్భావం.. పలు దేశాలకు సేవల విస్తరణ
- మార్పులకు అనుగుణంగా నైపుణ్యాలు
- కేటీఆర్ మాటల స్ఫూర్తితో అంతర్జాతీయ ప్రస్థానం



హైదరాబాద్, **నీలగిరి వార్త**

కేటీఆర్.. లోకల్ నుంచి గ్లోబల్ స్థాయికి ఎదిగిన లీడర్. ఆయన మాట్లాడితే కంపెనీలు తెలంగాణకు వరుస కడుతాయని అందరికీ తెలిసిందే. అది నిరూపితమైంది కూడా. కానీ ఆయన మాటల స్ఫూర్తితో అమెరికాలో ఏకంగా ఒక కంపెనీ పురుడుపోసుకున్నది. అది కూడా లోకల్ స్థాయి నుంచి గ్లోబల్ స్థాయికి ఎదుగుతున్నది. అంతేకాదు.. భారత దేశ ప్రధాన కార్యాలయాన్ని హైదరాబాద్‌లోనే ఏర్పాటు చేసింది. కేటీఆర్ ప్రసంగం స్ఫూర్తితో ఏర్పాటైన ఆ కంపెనీ పేరు 'ర్యాండమ్ ట్రీస్'. ఆ సంస్థ సీఈవో ప్రవీణ్ కోల. ప్రపంచ ప్రఖ్యాత యాపిల్ సంస్థ 2016 మే 19న హైదరాబాద్‌లో మ్యాపింగ్ సెంటర్ ఏర్పా టు చేసింది.నాటి ఆ సంస్థ సీఈవో టిమ్ కుక్, సీఎం కేసీఆర్ దాన్ని ప్రారంభించారు. ఐటీ శాఖ మంత్రిగా కేటీఆర్ చొరవ తీసుకోవడంతో యాపి

- మిగతా 2లో పేజిలో

గచ్చిబౌలిలో లెదర్ పరిశ్రమకు

## కొత్త ప్రోత్సాహం

- 3.5 ఎకరాల్లో ఆధునిక సదుపాయాల కల్పనకు ప్రణాళిక
- తోలు పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు
- లెదర్ రంగంలో మౌలిక సదుపాయాల బలోపేతం
- పరిశ్రమల అభివృద్ధి, ఉపాధి కల్పనే లక్ష్యం
- లెదర్ పారిశ్రామికవేత్తలకు ఒకే చోట ఆధునిక సౌకర్యాలు
- రాష్ట్రంలో లెదర్ రంగానికి కొత్త అవకాశాలు
- కామన్ ఫెసిలిటీ సెంటర్‌తో చిన్న పరిశ్రమలకు ప్రయోజనం
- లెదర్ రంగంలో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలకు ప్రోత్సాహం
- పరిశ్రమల విస్తరణకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి



మిగతా 2లో

హైదరాబాద్, **నీలగిరి వార్త**

: గచ్చిబౌలిలో 3.5 ఎకరాల్లో లెదర్ కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబువ్యాఖ్యానించారు. ఈరోజు (శనివారం) టీజీఎల్ఐపీసీ సమీక్షలో లెదర్ పరిశ్రమ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై మంత్రి శ్రీధర్ బాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## మరో 7--8 నెలల పాటు కొనసాగనున్న ఎల్‌నినో ప్రభావం?

- 2027లో ప్రపంచ ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరే అవకాశం
- పసిఫిక్ మహాసముద్రంలో పెరుగుతున్న సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు
- సాధారణ ఎల్‌నినో నుంచి సూపర్ ఎల్‌నినో దిశగా పరిణామం
- ప్రపంచవ్యాప్తంగా తీవ్రమవుతున్న ఎండలు.. వాతావరణంలో పెను మార్పులు
- ఎల్‌నినో ప్రభావంతో కరువు, వేడిగాలుల ముప్పు
- ప్రపంచ వాతావరణంపై తీవ్ర ప్రభావం చూపనున్న ఎల్‌నినో
- ఉష్ణోగ్రతల పెరుగుదలతో ప్రజారోగ్యానికి సవాళ్లు వర్షపాతంలో మార్పులు.. వ్యవసాయ రంగంపై ప్రభావం పడే అవకాశం



హైదరాబాద్, **నీలగిరి వార్త**

శీతాకాలంలోనూ ప్రపంచ దేశాలు భగ్గుమంటున్నాయి. ఐరోపాలోనైతే వేలాది మంది వృద్ధులు పిట్టల్లా రాలిపోతున్నారు. దుర్భరమైన కరువుతో భారత్ కల్లోలితంగా మారింది. పగలు ఎండ వేడిమి కొత్త రికార్డులు నమోదు చేస్తున్నది. మొన్నటికి మొన్న ఎల్‌నినోగా మొదలైన ఈ విపత్తు.. సూపర్ ఎల్‌నినోగా మారి, ఆ తర్వాత గాడ్జిల్లా ఎల్

మిగతా 2లో



## తుపాను ముప్పుపై అప్రమత్తంగా ఉండాలి

- మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ చేపల వేటకు వెళ్లొద్దు
- రైతులు పంటల రక్షణకు ముందస్తు జాగ్రత్తలు పాటించాలి
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

2లో

# రక్షణ రంగంలో భారతదేశాన్ని అగ్రగామిగా చూడాలనేది ఆకాంక్ష

కార్మిక మంత్రి జి.వివేక్, మాజీ ఎయిర్‌చీఫ్ మార్షల్ వివేక్ రామ్‌చౌదరి, 90 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు.
ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఆయుధాలు యుద్ధం కోసమే కాకుండా శాంతిని కాపాడేందుకు అవసరమని చె ప్పారు. శత్రువులు యుద్ధానికి దిగకుండా నిరోధించే శక్తి ఆయుధాలతోనే లభిస్తుందన్నారు. రక్షణ ఉత్పత్తుల్లో స్వయంస్వావలంబనకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను సాకారం చేయడానికి తెలంగాణ ఇప్పటికే తనవంతు కృషి చేస్తోందని చెప్పారు. దీన్ని పారిశ్రామికరంగం అందిపుచ్చుకోవాలని సూ చించారు. రక్షణ రంగంతో పాటు స్పేస్, ఏరోస్పేస్, సైబర్ సెక్యూరిటీ, కృతిమ మేధ, డ్రోన్ టెక్నాలజీ వంటి అనుబంధ రంగాల్లో ఈ సమావేశానికి హాజరైన వారంతా కృషి చేసి, భారత్ లక్ష్యాన్ని సాకారం చేయాలని కోరారు. తెలంగాణలో రక్షణ పెట్టుబడులకు పారిశ్రామికవేత్తలు వేసుకున్న ప్రణాళికలను రెట్టింపు చేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి సహకరించడంతో పాటు వారు వేసుకున్న లాభాల అంచనాలను కూడా రెట్టింపు చేసే బాధ్యతను తాను తీసుకుంటానని చెప్పారు.
ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం కావాలన్నా అడగాలని, సహకరించడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. తెలంగాణ అభివృద్ధి గురించి తనకు స్పష్టమైన దార్శనికత ఉందన్నారు. 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకుందని వివరించారు. అందుకే, తెలంగాణ రైజింగ్ విజన్-2047 పత్రాన్ని విడుదల చేశామని చెప్పారు. దేశ జనాభాలో ప్రస్తు తం తెలంగాణ వాటా 2.5శాతమని, జీడీపీలో తెలంగాణ వాటా 5 శాతమని వెల్లడించారు. 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి చేర్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ప్రకటించారు. తమ జీడీపీ లక్ష్యాలను చేరుకోవడంలో రక్షణ ఉత్పత్తుల తయారీ, ఏరోస్పేస్, వాటి అనుబంధ రంగాలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఒరిజనల్ ఎకి?్వపమెంట్ మ్యానుఫ్యాక్చరర్స్(ఓఈఎం), సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఒకే వేదికపై కలుసుకోవడానికి రక్ష ఎక్స్‌పో కీలక పాత్ర పోషిస్తుందని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. పరిశ్రమల ప్రతినిధులు, ఉన్నత స్థాయి రక్షణ దళాల అధికారులు, భద్రతారంగ అధికారులు, నిపుణులు, సరికొత్త సాంకేతిక పరిజాజనాన్ని తీసుకురావాలని ఆశించారు.

**రాష్ట్రంలో పాలసీ పెరాలిసిస్ లేదు**

రాజకీయంగా, సైద్ధాంతికంగా రాష్ట్రంలోని పార్టీల మధ్య భేదాభిప్రాయాలున్నా పెట్టుబడులు, అభివృద్ధి విషయంలో ఎలాంటి అభిప్రాయభేదాలు లేవని ముఖ్యమంత్రి పారిశ్రామికవేత్తలకు భరోసా ఇచ్చా రు. 1994 నుంచి ఇప్పటివరకు మూడు దశాబ్దాల కాలంలో మూడు పార్టీల ప్రభుత్వాలు వచ్చినా రాష్ట్రంలో అత్యుత్తమ విధానాలనే ప్రభుత్వాలు అమలుచేస్తూ వచ్చాయని చెప్పారు. పెట్టుబడులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూశారన్నారు. ఇతర రాష్ట్రాల్లో, దేశాల్లో అనుసరిస్తున్న అత్యుత్తమ విధానాలను అన్వయం చేసుకొని రాష్ట్రంలో అమలు చేస్తున్నామని చెప్పారు. త్వరలోనే ప్రభుత్వం రక్షణ 2.0 పాలసీని, ఏరోస్పేస్ పాలసీని ప్రకటించబోతోందని చెప్పారు. దేశంలో హైదరాబాద్ అత్యంత వ్యూహాత్మక నగరమని, పరిశోధన రంగంలో ప్రధాన పాత్ర పోషిస్తోందని గుర్తు చేశారు. ఆపరేషన్ సింధూర్ సమయంలోనూ 108 దేశాల భాగస్వామ్యంతో హైదరాబాద్‌లో అందాల పోటీలు నిర్వహించామని ప్రస్తావించారు. దక్షిణ భారతదేశంలో సముద్రతీరం లేని ఏకైక రాష్ట్రం తెలంగాణ అని, ఇక్కడే లో ఫ్రీక్వెన్సీ రాడార్ కేంద్రం ఏర్పాటవుతోందని చెప్పారు.
హైదరాబాద్ అత్యంత సురక్షిత మైన నగరమని, భారత సైన్యానికి, వైమానిక దళాలకు వ్యూహాత్మకంగా ముఖ్యమైన నగరం అని ప్రస్తావించారు. డీఆర్‌డీవో, హెచ్ఏఎల్, బీడీఎల్, మిధాని, టాటా, ఎయిర్‌బస్, సాఫ్రాన్, స్కైరూట్, లాక్‌హీడ్ మార్టిన్, భారత్ ఫోర్జ్ వంటి ప్రముఖ సంస్థల ప్రతినిధులు మన మధ్య ఉన్నారని ఆయన తెలిపారు. తెలంగాణలో రక్షణ, ఏరోస్పేస్ రంగాలకు అవకాశాలు మెండుగా ఉన్నాయని ప్రభుత్వం గుర్తించిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు.

# తుపాను ముప్పుపై అప్రమత్తంగా ఉండాలి

అమరావతి,:
బంగాళాఖాతంలో ఏర్పడిన బలమైన అల్పపీడనం తుపానుగా మారే అవకాశమున్న నేపథ్యంలో రాష్ట్రంలోని తీరప్రాంత జిల్లాల అధికారులు పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. తుపాను ప్రభావంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ మేరకు శనివారం మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్ నాయక్‌తో మంత్రి ఫోన్‌లో మాట్లాడి తుపాను ప్రభావం, సముద్రంలో ఉన్న మత్స్యకార బోట్ల పరిస్థితి, తీరప్రాంత జిల్లాల్లో చేపట్టిన ముందస్తు చర్యలపై సమీక్షించారు. భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఈ నెల 26 నాటికి తుపాను ఏర్పడి, 28 నాటికి ఆంధ్రప్రదేశ్ తీరానికి సమీపించే అవకాశమున్న నేపథ్యంలో అధికారులు ఎక్కడా నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం 5 గంటల నాటికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మొత్తం 30,043 మత్స్యకార బోట్లలో 29,952 బోట్లు హార్బర్లు, ఫిష్ ల్యాండింగ్ కేంద్రాల్లో సురక్షితంగా ఉండగా, మరో 91 బోట్లు సముద్రంలో ఉన్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. వీటిలో విశాఖపట్నం జిల్లాలో 37, అనకాపల్లిలో 1, కాకినాడలో 1, కృష్ణా జిల్లాలో 20, బాపట్ల జిల్లాలో 32 బోట్లు ఉన్నట్లు తెలిపారు. సముద్రంలో ఉన్న 91 బోట్లలో 72 మెకనైజ్డ్, 19 మోటరైజ్డ్ బోట్లు ఉన్నాయని వెల్లడిం చారు. ఈ బోట్లన్నీ వీలైనంత త్వరగా సురక్షితంగా తీరానికి చేరుకునేలా పటిష్ఠ చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. మత్స్యకార సంఘాలు, బోటు యజమానులు, హార్బర్ అధికారులు, కోస్ట్‌గార్డ్, మెరైన్ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ సముద్రంలో ఉన్న ప్రతి బోటు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

# తుఫాన్ సూచన.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన వాయిదా

భువనేశ్వర్: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రెండు రోజుల పాటు ఒడిశాలో పర్యటించాల్సి ఉన్నది. అయితే ఆ రాష్ట్రంలోని తీర ప్రాంతాల్లో తుఫాన్ ఏర్పడే అవకాశమున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన వాయిదా పడింది.

అక్టోబర్ 28 నుంచి ప్రారంభం కావాల్సిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఒడిశా పర్యటన వాయిదా పడినట్లు అధికారులు తెలిపారు. 'ప్రతికూల వాతావరణ సూచనలు, భద్రతా జాగ్రత్తల దృష్ట్యా రాష్ట్రపతి పర్యటనను వాయిదా వేశాం' అని ప్రధాన కార్యదర్శి కార్యాలయానికి చెందిన ఒక అధికారి పేర్కొన్నారు.కాగా, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అక్టోబర్ 28, 29 తేదీల్లో ఒడిశాలోని రైరంగపూర్‌తో పాటు సొంత జిల్లా అయిన మయూర్‌భంజ్‌ను సందర్శించాల్సి ఉన్నది. అయితే మయూర్‌భంజ్ జిల్లా యంత్రాంగం తెలిపిన వివరాల ప్రకారం రాష్ట్రపతి పర్యటన రద్దు కాలేదు. కేవలం తేదీలు మాత్రమే మారాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నవంబర్ 4, 5 తేదీల్లో మయూర్‌భంజ్‌లో పర్యటిస్తారని ఆ అధికారి వివరించారు.మరోవైపు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుపానుగా బలపడే అవకాశం ఉన్నదని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) శనివారం తెలిపింది. అక్టోబర్ 28 ఉదయానికి ఉత్తర ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీరాల మధ్య ఎక్కడో ఒకచోట తీరం దాటవచ్చని పేర్కొంది.

# కేటీఆర్ ప్రసంగంతో స్ఫూర్తి పొంది అమెరికాలో కంపెనీ ఏర్పాటు

తెలంగాణకు తరలివచ్చింది. నాడు కేటీఆర్ చే సిన ప్రసంగం ప్రవీణ్ కోలను ప్రభావితం చేసిం ది. ఆ మాటల స్ఫూర్తితో 2017 లో అమెరికాలో ని టెక్సాస్‌లో 'ర్యాండమ్ ట్రీస్'ను ప్రారంభించా రు. అంతర్జాతీయ విస్తరణలో భాగంగా ర్యాండమ్ ట్రీస్ తన ప్రధాన కార్యాలయాన్ని హైదరాబాద్ లో ఏర్పాటు చేసింది. దీన్ని శనివారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రారంభించారు.

**ఏఐతో ఆందోళన వద్దు: కేటీఆర్**

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ను (ఏఐ) ఉద్యోగాలు హరించే భూతంలా కాకుండా, కొత్త అవకాశాలను సృష్టించే సాంకేతిక పరిజ్ఞానంగా చూడాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ర్యాండమ్ ట్రీస్ సంస్థ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. ప్రతి సాంకేతిక విప్లవానికి ముందు కొన్ని భయాలు, సందేహాలను సృ ష్టించినా, కాలక్రమేణా కొత్త రంగాలకు, ఉపాధి అవకాశాలకు మార్గం సుగమం చేసిందని చెప్పా రు. గతంలో బ్యాంకింగ్ రంగంలో కంప్యూటర్ల ప్రవేశాన్ని వ్యతిరేకించిన విషయాన్ని గుర్తుచేశారు.
మార్పులను అడ్డుకోవడం కంటే వాటికి అనుగుణంగా మారడమే అభివృద్ధికి సోపానమని పేర్కొన్నారు. ఏఐ వల్ల ఉద్యోగాలు పోతాయనే ఆందోళనతో ఆగిపోకుండా, దాన్ని ఎలా ఉపయోగించుకోవాలి? ప్రపంచ పోటీలో ఎలా ముందుండాలి? అనే అంశాలపై యువత దృష్టి సారించాలని సూచించారు. సిల్లింగ్, అప్ సిల్లింగ్, రీసిల్లింగ్‌తోపాటు కొత్త విషయాలు నేర్చుకోవడం, అవసరమైనప్పుడు పాత పద్ధతులను వదిలి కొత్త విధానాలు స్వీకరించడం నేటి ఉద్యోగ ప్రపంచంలో కీలకమని చెప్పారు. ఏఐని 'భూతం'గా అభివర్ణిస్తూ ప్రజల్లో భయాలు కలిగించడం సరైన విధానం కాదని అభిప్రాయపడ్డారు. సాంకేతిక మార్పులను అర్థం చేసుకొని, వాటిని ఉపయోగించుకునేలా ప్రభుత్వాలు విధానాలను రూపొందించాలని సూచించారు.
ఉపాధి కల్పనలో 'ప్రైవేట్'దే కీలక పాత్ర
అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడం సాధ్యం కాదని, ప్రైవేట్ రంగం అభివృద్ధి చెందేలా అవసరమైన పరిస్థితులను సృష్టించడం ముఖ్యమని కేటీఆర్ అభిప్రాయపడ్డారు.

# ఎంబిబిఎస్ ప్రథమ సంవత్సరం ఉత్తీర్ణతలో ప్రభుత్వ వైద్య కళాశాలల ముందంజ

అమరావతి, రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలు ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో ప్రైవేటు కళాశాలల కంటే మెరుగైన ఉత్తీర్ణతను నమోదు చేస్తున్నాయి. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం గణాంకాల ప్రకారం 2025--26 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 88.11 శాతం మంది ఉత్తీర్ణులు కాగా, ప్రైవేటు కళాశాలల్లో 80.68 శాతమే ఉత్తీర్ణులయ్యారు. ప్రైవేటు కళాశాలలతో పోలిస్తే ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణత 7.43 శాతం మేర అధికంగా నమోదైంది. 2025--26 విద్యా సంవత్సరంలో సిద్ధార్థ వైద్య కళాశాల, విజయవాడలో 93.68 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఆంధ్ర వైద్య కళాశాల, విశాఖపట్నంలో 93.20 శాతం, శ్రీ వేంకటేశ్వర వైద్య కళాశాల, తిరుపతిలో 92.50 శాతం, పాడేరు ప్రభుత్వ వైద్య కళాశాలలో 92 శాతం ఉత్తీర్ణత నమోదయ్యాయి. కర్నూలులో 90.80 శాతం, మచిలీపట్నంలో 88.67 శాతం, రాజమహేంద్రవరంలో 88 శాతం ఉత్తీర్ణత సాధించారు.ఇతర కళాశాలల్లో ఏసీఎస్ఆర్ ప్రభుత్వ వైద్య కళాశాల, నెల్లూరులో 86.86 శాతం, నంద్యాలలో 86.51 శాతం, రంగరాయ వైద్య కళాశాల, కాకినాడలో 86 శాతం, శ్రీకాకుళంలో 86 శాతం ఉత్తీర్ణత నమోదైంది. అనంతపురంలో 84.92 శాతం, ఏలూరులో 84.67 శాతం, గుంటూరులో 84 శాతం, విజయనగరంలో 83.33 శాతం ఉత్తీర్ణత నమోదైంది. గత విద్యా సంవత్సరంతో పోలిస్తే కొన్ని కళాశాలల్లో ఉత్తీర్ణత తగ్గగా, మరికొన్ని కళాశాలల్లో పెరిగింది. ముఖ్యంగా పాడేరు, మచిలీపట్నం, ఆంధ్ర వైద్య కళాశాలల్లో మెరుగైన ఫలితాలు నమోదయ్యాయి.

2024--25లో ప్రభుత్వ కళాశాలల్లో...
2024--25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 93.48 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ప్రైవేటు కళాశాలల్లో 88.64 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల మొత్తం ఉత్తీర్ణత 91 శాతంగా నమోదైంది. ఆ ఏడాది రాజమహేంద్రవరం వైద్య కళాశాలలో 98 శాతం, గుంటూరులో 97.60 శాతం, ఏలూరులో 97.33 శాతం, కర్నూలులో 96.80 శాతం, శ్రీ వేంకటేశ్వర వైద్య కళాశాల, తిరుపతిలో 96.67 శాతం ఉత్తీర్ణత నమోదైంది. సిద్ధార్థ వైద్య కళాశాల, విజయవాడలో 93.71 శాతం, ఏసీఎస్ఆర్ ప్రభుత్వ వైద్య కళాశాల, నెల్లూరులో 93.71 శాతం, ఆంధ్ర వైద్య కళాశాల, విశాఖపట్నంలో 91.60 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ వివరాలను ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ సాయి సుధీర్, పరీక్షల నియంత్రణాధికారి శ్రీకాంత్ తెలిపారు.

# గచ్చిబౌలిలో లెదర్ పరిశ్రమకు కొత్త ప్రోత్సాహం

డిజైనింగ్ నుంచి బ్రాండింగ్ వరకు ఆర్టిజన్లకు పూర్తిగా మార్గనిర్దేశం చేశారు. లెదర్ ఉత్పత్తులకు వాల్యూ యాడెడ్ చేసి మార్కెటింగ్‌కు సహకారం కల్పిస్తున్నామని వెల్లడించారు.

**యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం..**

రుక్మాపూర్‌లో పర్యావరణహిత చర్మశుద్ధి కర్మాగారాలు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఈ పరిశ్రమ ద్వారా సుమారు 1,000 మందికి ఉపాధి కల్పిస్తున్నామని చెప్పుకొచ్చారు. ఎస్సీ యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. జమ్మికుంట, ఆర్మూర్‌లో ప్లగ్ అండ్ ప్లే ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. గతంలో లిడ్ క్యాప్‌కు కేటాయించిన భూములపై క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలని అధికారులను మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు.

# అమెరికన్ల హత్యకు ఇరాన్ కుట్ర..

ఇరాన్ , ఇరాన్-అమెరికా యుద్ధం మొదలైన తర్వాత ఇరు దేశాల మధ్య శతృత్వం తారస్థాయికి చేరింది. ఇరాన్‌కు చెందిన అగ్రనేతల్ని అమెరికా హతమార్చిన సంగతి తెలిసిందే. దీంతో అమెరికాపై ప్రతీకారం తీర్చుకునేందుకు ఇరాన్ అన్ని రకాలుగా సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో సంచలన విషయాలు వెల్లడయ్యాయి. మిడిల్ ఈస్ట్ సహా వివిధ దేశాల్లో ఉన్న అమెరికా రాయబార సిబ్బందితోపాటు, అమెరికా ఇతర అధికారుల హత్యకు ఇరాన్ కుట్ర పన్నినట్లు తేలింది. ఈ మేరకు అమెరికా నిఘా విభాగానికి ఒక నివేదిక అందింది. దీంతో అప్రమత్తమైన అమెరికా హై అలర్ట్ ప్రకటించింది. వివిధ దేశాల్లో పని చేస్తున్న అమెరికా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ముందు జాగ్రత్త చర్యగా వివిధ దేశాల్లోని రాయబార సిబ్బందిని అమెరికా తగ్గిస్తోంది. ఈ మేరకు అమెరికా రక్షణ శాఖ మంత్రి మార్క్ రుబియో ఈ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ఇంటెలిజెన్స్ నివేదిక ఆధారంగా చర్యలకు దిగారు. అమెరికాకు అందిన నివేదిక ప్రకారం అమెరికా పౌరుల హత్యకు ఇరాన్ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. కొంతకాలంగా కుట్ర చేస్తోంది. ఈ ప్రయత్నాలు కీలక దశకు చేరుకున్నట్లు తెలిపింది.

అమెరికా పౌరుల్ని అంతం చేస్తామని ఇరాన్ గతంలోనే హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో తమకు భద్రత తక్కువ, ముప్పు ఎక్కువ ఉందని భావించే దేశాల నుంచి రాయబార సిబ్బందిని అమెరికా తగ్గిస్తోంది. అమెరికా పౌరుల్ని సొంత దేశానికి రప్పించుకుంటోంది. సిబ్బందిని తిరిగి రావాల్సిందిగా ఆదేశించింది. మరోవైపు ఇరాన్‌పై అమెరికా మరోసారి తీవ్ర దాడులకు సిద్ధమవుతోంది. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేరుగా ప్రకటించారు.

# మరో 7--8 నెలల పాటు కొనసాగనున్న ఎల్‌నినో ప్రభావం?

నినోగా పరిణామం చెంది ఇప్పుడు మరింతగా తీవ్రమయ్యింది. ఎంతగా అంటే, 150 ఏండ్ల కిందట ప్రపంచంపై విరుచుకుపడిన ఎల్‌నినో విపత్తును దాటేసి ఇప్పుడు 'సూపర్ డూపర్ ఎల్‌నినో'గా రూపాంతరం చెందింది.

**మారిన అంచనాలు**

వచ్చే ఫిబ్రవరినాటికి ఎల్ నినో తీవ్రస్థాయికి చేరి అనంతరం తగ్గుముఖం పట్టొచ్చని గత నెలలో పలు వాతావరణ సంస్థలు అంచనాలు వేశాయి. అయితే, పసిఫిక్ మహా సముద్ర జలాల ఉష్ణోగ్రతలు అంతకంతకూ పెరిగిపోతుండటం, వాతావరణ మార్పులతో ఎల్‌నినో తన ప్రభావాన్ని మరింతగా పొడిగించుకొనే అవకాశమున్నట్టు నిపుణులు చెప్తున్నారు.

**ఎల్ నినోతో పసిఫిక్ సలసలా!**

ప్రపంచంపై పంజా విసురుతున్న ఎల్‌నినో అసాధారణ తీవ్రతతో కొనసాగుతున్నది. దీని కారణంగా పసిఫిక్ మహాసముద్రం ఒక ప్రధాన ఉష్ణోగ్రత పరిమితిని దాటింది. ఇప్పటికే ఎల్‌నినో భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా వాతావరణంపై చూపే ప్రభావం గురించి ఆందోళన పెంచుతున్నది. అమెరికా జాతీయ సముద్ర, వాతావరణ పరిపాలన నుంచి వచ్చిన డాటా ప్రకారం ఈ ఏడాది అక్టోబర్ 22న భూమధ్యరేఖ పసిఫిక్‌లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు 30 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకున్నాయి.
ఇంతకుముందెన్నడూ ఉష్ణోగ్రత ఈ స్థాయికి చేరుకోలేదు. ఈ వాతావరణ తీవ్రత మరింత బలపడుతూ, వచ్చే ఏడాది వరకు కూడా దీని ప్రభావం కొనసాగే అవకాశం ఉండటంతో దీనిని కీలకఘట్టంగా భావిస్తున్నారు. మధ్య, తూర్పు ఉష్ణమండల పసిఫిక్‌లలో అక్టోబర్-డిసెంబర్‌లలో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదయ్యే అవకాశం ఉందని ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంవో) హెచ్చరించింది. ఎల్‌నినో పరిస్థితులు వచ్చే మే-జూన్ వరకూ కొనసాగే అవకాశం ఉన్నట్టు నిపుణులు చెప్తున్నారు. అనంతరం బలహీనపడిన తర్వాత ఎల్‌నినో పరిస్థితి ఏ దిశగా మారుతుందో ఇప్పుడే కచ్చితంగా చెప్పలేమని అభిప్రాయపడుతున్నారు. ఎల్‌నినో కారణంగా 2027 చరిత్రలోనే అత్యంత వేడి సంవత్సరాల్లో ఒకటిగా నిలిచే అవకాశమున్నట్టు చెప్తున్నారు.

**ఆర్థిక వ్యవస్థలకూ కష్టమే**

ప్రస్తుతం కొనసాగుతున్న ఎల్‌నినో పరిస్థితులు వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్ వరకూ కొనసాగే అవకాశం ఉన్నదని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఈపీటీఆర్ఐ) హెడ్ డాక్టర్ జే రాజేశ్వర్ తెలిపారు. ఉష్ణోగ్రతలు ఇలాగే కొనసాగితే ఎల్‌నినో వచ్చే జూన్ వరకు కూడా ఉండొచ్చని పేర్కొన్నారు. వచ్చే ఏడాదిలో ఉష్ణోగ్రతలు కొత్త రికార్డులు నమోదు చేసే అవకాశమున్నట్టు పేర్కొన్నారు.మధ్య పసిఫిక్ జలాల ఉష్ణోగ్రతలు మరింతగా పెరుగుతుండటంతో వచ్చే ఏడాది మే-జూన్ వరకూ ఎల్‌నినో నిలకడగా ఉండే పరిస్థితులు బలపడుతున్నాయని ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ అధికారులు పేర్కొన్నారు.

# రోడ్డుపై షెడ్డు, ప్రయాణికులకు అవస్థలు

## అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం



కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:
కామారెడ్డి బస్టాండ్‌కు వెళ్లే మార్గంలో రోడ్డుకు మధ్యలో షెడ్డు ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు, ఆటో డ్రైవర్లు, పండ్ల దుకాణాల యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.
రోడ్డుపై షెడ్డు కారణంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడే పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. కొందరు ప్రయాణికులు కిందపడిపోతున్నారని, బస్టాండ్‌కు వెళ్లేందుకు ఇన్‌గేట్, ఔట్‌గేట్ మార్గాల్లో ప్రయాణించడం ప్రమాదకరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మరోవైపు, ఈ సమస్య కారణంగా సుమారు 40 కుటుంబాలకు చెందిన ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికులు ఆటోల్లో వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటుండటంతో తమ ఆదాయం తగ్గిపోయిందని వాపోతున్నారు. పండ్ల దుకాణాల వద్దకు వినియోగదారులు రావడం లేదని, రోజువారీ జీవనం గడపడం కూడా కష్టంగా మారిందని దుకాణ యజమానులు ఆవేదన చెందుతున్నారు. సమస్యను పరిష్కరించేందుకు మున్సిపల్ అధికారులు గతంలో వచ్చి రెండు రోజుల్లో చర్యలు తీసుకుంటామని చెప్పినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి పరిష్కారం లభించలేదని బాధితులు పేర్కొంటున్నారు. అధికారుల హామీ అమలుకు నోచుకోకపోవడంతో ప్రయాణికులు, వ్యాపారులు, ఆటో డ్రైవర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్డుపై ఉన్న షెడ్డు సమస్యను పరిష్కరించి, ప్రయాణికులకు సురక్షితమైన రాకపోకల సౌకర్యం కల్పించాలని దుకాణ యజమానులు, ఆటో యూనియన్ సభ్యులు, ప్రయాణికులు కోరుతున్నారు. సమస్యను వెంటనే పరిష్కరిస్తే 40 ఆటో డ్రైవర్ల కుటుంబాలతో పాటు పండ్ల దుకాణాల యజమానులకు కూడా ఉపశమనం లభిస్తుందని చెబుతున్నారు. ప్రమాదం జరగకముందే అధికారులు చర్యలు తీసుకుంటారా? లేక సమస్యను అలాగే వదిలేస్తారా? అన్నది వేచి చూడాల్సి ఉంది.

# లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన నిజామాబాద్ మున్సిపల్ ఆర్.ఐ.

కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:
లంచం లేనిదే ఏ ప్రభుత్వ కార్యాలయంలో పనులు కావడం లేదు, అవినీతి అధికారులను పట్టుకోవడానికి ప్రత్యేకంగా ఏసీబీ దాడులు నిర్వహిస్తూ కోట్లాది రూపాయల అక్రమ ఆస్తులను వెలుగులోకి తీసుకోవచ్చారు. కిందిస్థాయి ఉద్యోగి నుంచి ఉన్నత స్థాయి అధికారుల వరకు లంచాలు ఇవ్వనిదే ఏ పని కూడా జరగడం లేదు అన్న దానికి నిదర్శనం ఈ ఏడాదిలో సుమారుగా 500 పైగా అవినీతి అధికారులు పోలీసులకు చిక్కారు. తాజాగా నిజామాబాద్ మున్సిపల్ కార్యాల యంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్గా పనిచేస్తున్న వినోద్ లంచం తీసుకుంటూ శనివారం ఏసీబీకి చిక్కారు. ఆర్ఐ దిలీప్ ను విచారిస్తున్నాం అని ఏసిబి అధికారులు తెలిపారు. గతంలో నిజామాబాద్ మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న అనిల్ లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. ఆయన ఇంట్లో సోదాలు చేయగా ఆదాయం మించి ఆస్తులు కూడా పెట్టుకున్నట్లు ఏసీబీ అధికారుల విచారణలో బయటపడింది. తాజాగా మళ్లీ నిజామాబాద్ మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న రెవెన్యూ ఇన్స్పెక్టర్ దిలీప్ ఏసిబికి పట్టుపట్టడం తీవ్ర సంచలనం లేపింది.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

## రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

## లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గుద్దేటి జంగయ్య






దేవరకొండ నీలగిరి వార్త ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ప్రాణాలను కాపాడేందుకు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని లయన్స్ క్లబ్ ఆఫ్ దేవరకొండ అధ్యక్షుడు గుద్దేటి జంగయ్య పిలుపునిచ్చారు. రక్తదానం మహాదానమని, అత్యవసర సమయాల్లో రక్తం అందుబాటులో లేకపోవడం వల్ల ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని, అలాంటి పరిస్థితుల్లో రక్తదాతలు ముందుకు వచ్చి ఆపన్నులకు అండగా నిలవాలని ఆయన సూచించారు. పోలీస్ అమరవీ రుల వారోత్సవాల్లో భాగంగా శనివారం దేవరకొండ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో లయన్స్ క్లబ్ ఆఫ్ దేవరకొండ ఆధ్వర్యంలో, దేవరకొండ పోలీస్ శాఖ, స్పోర్ట్స్ అసోసియేషన్, వాసవి వనిత క్లబ్‌ల సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని దేవరకొండ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ వెంకట్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా యువత పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేయడం విశేషం. మొత్తం 48 మంది రక్తదాతలు రక్తాన్ని అందించి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు.

### రక్తదానం ప్రాణదానంతో సమానం

ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గుద్దేటి జంగయ్య మాట్లాడుతూ, రక్తదానం చేయడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు ప్రాణరక్షణ కల్పించవచ్చని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, ఇతర వైద్య అత్యవసర పరిస్థితుల్లో రక్తం ఎంతో అవసరమవుతుందని పేర్కొన్నారు. సరైన సమయంలో రక్తం అందక ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు రాకుండా ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో రక్తదానానికి ముందుకు రావాలని కోరారు.
ఆరోగ్య పరిస్థితులు అనుకూలంగా ఉన్నవారు వైద్యుల సూచనలు, నిర్దేశిత నిబంధనల ప్రకారం సాధారణంగా మూడు నెలల వ్యవధిలో రక్తదానం చేయవచ్చని తెలిపారు. రక్తదానంపై యువతలో అవగాహన పెంపొందించాలని, అపోహలను వీడి స్వచ్ఛందంగా రక్తదానం చేసే అలవాటును పెంచుకోవాలని సూచించారు. రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడమే కాకుండా సమాజంలో సేవాభావం, మానవతా విలువలు పెంపొందుతాయని పేర్కొన్నారు.

### రక్తదాతలకు ప్రశంసాపత్రాల పంపిణీ

రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తాన్ని అందించిన దాతలను పోలీస్ శాఖ తరపున అభినందించారు. దేవరకొండ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ వెంకట్ రెడ్డి రక్తదాతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు.
రోడ్డు ప్రమాద బాధితులు, అత్యవసర చికిత్స పొందుతున్న రోగులకు సకాలంలో రక్తం అందించడం ఎంతో కీలకమని తెలిపారు. రక్తదానం ద్వారా ఒకరి ప్రాణాలను కాపాడే అవకాశం లభిస్తుందని, ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని గుర్తించి స్వచ్ఛంద రక్తదాన కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.

### సేవా కార్యక్రమాలకు లయన్స్ క్లబ్ పెద్దపీట

లయన్స్ క్లబ్ ఆఫ్ దేవరకొండ ఆధ్వర్యంలో విద్య, వైద్యం, ఆరోగ్యం వంటి రంగాలకు సంబంధించి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు గుద్దేటి జంగయ్య తెలిపారు. పేదలకు వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఉచిత మెగా వైద్య శిబిరాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలను ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నామని వెల్లడించారు.
గత సంవత్సరం కూడా పెద్ద సంఖ్యలో రక్త యూనిట్లను సేకరించి అవసరమైన వారికి ఉపయోగపడేలా సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడినవారికి, వైద్య సహాయం అవసరమైన పేదలకు తమ వంతు సహకారం అందించేందుకు లయన్స్ క్లబ్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలకు చేరువగా ఉంటామని పేర్కొన్నారు.

### లయన్స్ క్లబ్ సేవలను అభినందించిన డీఎస్పీ

దేవరకొండ డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ, లయన్స్ క్లబ్ వంటి సేవా సంస్థలు తండాల నుంచి పట్టణాల వరకు విస్తృతంగా సేవలందించడం అభినందనీయమని అన్నారు. సమాజంలో సేవాభావంతో పనిచేసే సంస్థలు ఉండటం పేదలకు గొప్ప వరమని పేర్కొన్నారు. విద్య, వైద్యం, ఆరోగ్యం వంటి కీలక రంగాల్లో ఇటువంటి సంస్థలు అందించే సహకారం ఎంతో విలువైనదని తెలిపారు.ప్రజల అవసరాలను గుర్తించి, వారికి అండగా నిలిచే సేవా సంస్థలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ముఖ్యంగా యువత సామాజిక బాధ్యతను గుర్తించి రక్తదానం, ఆరోగ్య శిబిరాలు, ఇతర సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. పోలీస్ శాఖ చేపట్టే సామాజిక కార్యక్రమాలకు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు సహకరించడం ద్వారా సమాజానికి మరింత మేలు చేకూరుతుందని పేర్కొన్నారు.

### పలువురు ప్రముఖుల పాల్గొనడం

ఈ రక్తదాన శిబిరంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రకాష్, లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కాశిరెడ్డి రవీందర్ రెడ్డి, కోశాధికారి చిలుకూరి కాశీనాథ్, వస్కుల సత్యనారాయణ, లకుమారపు మల్లయ్య, నీల బుచ్చయ్య, రఘురాం నాయక్, కడారి బలరాం యాదవ్, దినేష్ స్పోర్ట్స్ వాషింగ్ మిషన్ అధ్యక్షుడు ఎన్ వి టి తాళ్ల శ్రీధర్ గౌడ్ కౌన్సిలర్లు హనుమంతు సాయి చంద్ర గౌడ్, కేతావత్ అజయ్ చంద్ర, పులిజాల భవాని జానీ, ముత్యాల చంద్రకళ రవి,పాటు పలువురు కౌన్సిలర్లు, వైద్య సిబ్బంది, పోలీస్ సిబ్బంది, లయన్స్ క్లబ్ సభ్యులు, యువత పాల్గొన్నారు.
మొత్తంగా పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఈ రక్తదాన శిబిరం విజయవంతమైంది. 48 మంది స్వచ్ఛంద రక్తదాతలు ముందుకొచ్చి రక్తాన్ని అందించడం ద్వారా ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచేందుకు తమ సంసిద్ధతను చాటుకున్నారు. రక్తదానం పట్ల ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించి, అవసరమైన సమయంలో రక్తం అందుబాటులో ఉండేలా ఇటువంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడ్డారు.

# పోలీస్ స్టేషన్‌లో వీరంగం.. వ్యక్తి అరెస్ట్

## మద్యం మత్తులో పోలీసులపై దుర్భాషలు.. దాడికి యత్నం

## నిందితుడికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్




గట్టుప్పల్, అక్టోబర్ 24 (నీలగిరి వార్తా ప్రతినిధి):
మద్యం మత్తులో పోలీస్ స్టేషన్‌కు వచ్చి విధుల్లో ఉన్న పోలీసులపై దుర్భాషలాడుతూ, విధులకు ఆటంకం కలిగించి వీరంగం సృష్టించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. న్యాయస్థానం నిందితుడికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు.?ఎస్సై సంపత్ తెలిపిన వివరాల ప్రకారం.. గట్టుప్పల్‌కు చెందిన ఖమ్మం ప్రభాకర్ (33) ఈ నెల 20న సాయంత్రం మద్యం మత్తులో స్థానిక పోలీస్ స్టేషన్‌కు వచ్చాడు. అక్కడ విధుల్లో ఉన్న పోలీసులతో దురుసుగా ప్రవర్తిస్తూ దుర్భాషలాడాడు. అంతేకాకుండా, పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తూ వారిపై దాడికి యత్నించి వీరంగం సృష్టించాడు. ఈ ఘటనపై హెడ్ కానిస్టేబుల్ ఫిర్యాదు చేయడంతో ఎస్సై సంపత్ కేసు నమోదు చేశారు.ఈ క్రమంలో శనివారం నిందితుడిని అరెస్టు చేసి నల్గొండ న్యాయస్థానంలో హాజరుపరిచారు. కేసును విచారించిన న్యాయమూర్తి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో పోలీసులు నిందితుడిని జైలుకు తరలించారు.

# జగ్గయ్య తండా శివారు కాలువలో వ్యక్తి మృతదేహాలభ్యం : పోలీసులు దర్యాప్తు



నీలగిరివార్త /మిర్యాలగూడ /అక్టోబర్ 24 మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జగ్గయ్య తండా శివారు ప్రాంతంలో నాగార్జునసాగర్ ఎడమ కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించిందని సమాచారం అందడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.పోలీసుల విచారణలో మృతుడు మిర్యాలగూడ పట్టణం ముత్తిరెడ్డికుంటకు చెందిన ఆలేటి వీరబాబు (48), తండ్రి లక్ష్మయ్య, వృత్తి బార్బర్ గా గుర్తించారు.కుటుంబ సభ్యుల కథనం ప్రకారం, మృతుడు గత కొంతకాలంగా వెరికోస్ వెయిన్స్, చర్మ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఆరు సంవత్సరాల క్రితం శస్త్రచికిత్స చేయించుకున్నప్పటికీ తిరిగి సమస్య పునరావృతం కావడంతో మనస్తాపానికి గురయ్యేవాడని తెలిపారు.తేదీ 24-10-2026న ఉదయం 9 గంటలకు సింధు సెలూన్కు వెళ్లిన వ్యక్తి తిరిగి ఇంటికి రాలేదని, అనంతరం కాలువలో మృతదేహం లభించినట్లు తెలిసిందని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులు గుర్తించారు.మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సబ్-ఇన్స్పెక్టర్ ఉప్పు నగేష్ తెలిపారు. కుటుంబ సభ్యులకు ఎలాంటి అనుమానాలు లేవని పేర్కొన్నారు.

# పట్టుబడిన గంజాయిని, ధ్వంసం చేసిన పోలీసులు

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త. తెలంగాణా యాంటీ నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్ ఆదేశాల మేరకు, వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన 106 కేసులకు సంబంధించి, స్వాధీనం చేసుకున్న 967.864 కిలోల గంజాయిని, సుమారు రూ. 4,83,93,200 (రూ.4.83 కోట్ల) విలువైన గంజాయిని, డ్రగ్ డిస్పోజల్ కమిటీ వారు నిబంధనల ప్రకారం ధ్వంసం చేశారు.డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్, ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ ఆధ్వర్యంలో, ఈరోజు హనుమకొండ మండలం అమ్మవారిపేట గ్రామ శివారులో ఉన్న కాకతీయ మెడిక్లీన్ సర్విస్ వారి భస్మీకరణ ప్లాంట్ లో గంజాయి ధ్వంస కార్యక్రమాన్ని నిర్వహించారు.మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ నిరంతరం చర్యలు చేపడుతోందని, మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటూ, మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి పోలీస్ శాఖ కృషి చేస్తోందని డీసీపీ అంకిత్ కుమార్ తెలిపారు.
ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ(పరిపాలన) రాయల ప్రభాకర్ రావు, సీసీఆర్బీ ఏసీపీ డేవిడ్ రాజు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా నిమిషా యాదవ్ జన్మదిన వేడుకలు




గట్టుప్పల్, నీలగిరి వార్తా ప్రతినిధి, అక్టోబర్ 24: గట్టుపల్ మండలం లోని శేరిగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు గోడేటి బ్రదర్స్ సురేష్ బ్రదర్ శ్రీనివాస్ కుమార్తె నిమిషా యాదవ్ జన్మదిన వేడుకలను శనివారం కుటుంబ సభ్యులు బంధుమిత్రులు ఆత్మీయులు ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్ల ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. పుట్టినరోజు సందర్భంగా ఉదయం గ్రామంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో స్వామి అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఆప్యాయతలు, అభినందనల మధ్య వేడుకలు ఆనందోత్సాహంగా సాగాయి. నిమిషా యాదవ్ జీవితంలో మరెన్నో విజయాలు సాధిస్తూ, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న గరివిడి లక్ష్మి యూనిట్ టీం.



వరంగల్ బ్యూరో నీలగిరి వార్త. వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానాన్ని ఈ రోజు సాయంకాలం గరివిడి లక్ష్మి చిత్రం యూనిట్ సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన చిత్రం యూనిట్ కు ఆలయ ధర్మకర్తలు గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, మోతుకూరి మయూరి రామేశ్వర్రావు, కమటం వేణుగోపాల్, చిదురాల అంజనీదేవిలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చిత్రం యూనిట్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. పూజానంతరం ఆలయ మహామండపంలో కుంకుమార్చనలు నిర్వహించిన తదుపరి అర్చకులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు.

## 27 నుంచి ఆర్ట్స్ కళాశాలలో క్రీడా పోటీలు.




వరంగల్ బ్యూరో నీలగిరి వార్త. హనుమకొండ సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఈ నెల 27వ తేదీ నుంచి అంతర్ కళాశాల బాలుర క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుంకరి జ్యోతి తెలిపారు. ఈ పోటీల్లో కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ డిగ్రీ కళాశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొననున్నారని ఆమె పేర్కొన్నారు.పోటీల్లో పాల్గొనే విద్యార్థులు తమ తమ కళాశాలల నుంచి జారీ చేసిన గుర్తింపు పత్రాలను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని, నిర్ణీత క్రీడా నిబంధనలను పాటిస్తూ పోటీల్లో పాల్గొనాలని ప్రిన్సిపాల్ సూచించారు. క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతోపాటు పోటీల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆమె వెల్లడించారు.ఈ నెల 27వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రారంభ సమావేశం నిర్వహించనున్నట్లు ఆచార్య జ్యోతి తెలిపారు. ఈ కార్యక్రమానికి కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కర్నాటి ప్రతాపరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం, ఓఎస్డీ ఆచార్య వెంకటరామిరెడ్డి, కాకతీయ విశ్వవిద్యాలయం క్రీడా విభాగం సంచాలకులు డాక్టర్ శాస్త్రి, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్ హాజరుకానున్నారని పేర్కొన్నారు. ప్రారంభ సమావేశానికి తాను అధ్యక్షత వహించనున్నట్లు ఆమె తెలిపారు.విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతోపాటు వివిధ కళాశాలల విద్యార్థుల మధ్య స్నేహభావం, పరస్పర సహకారాన్ని ప్రోత్సహించేందుకు ఈ పోటీలు దోహదపడతాయని ప్రిన్సిపాల్ ఆచార్య జ్యోతి పేర్కొన్నారు.ఈ క్రీడా పోటీలు 27 నుండి 30వ తేదీ వరకు నిర్వహించబడుతుందని ఇందులో బాల్ బ్యాట్మెంటన్, చదరంగం,దీర్ఘదూర పరుగు పందెంహ్యాండ్‌బాల్,కబడ్డీ,సాఫ్ట్‌బాల్

## భువనేశ్వర్ అర్బన్ కాన్క్లేవ్‌లో పాల్గొన్న.

### జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, కూడా వైస్ చైర్ పర్సన్ చాహత్ బాజ్ పాయి.

### వరంగల్ నగరానికి అవార్డు.




వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.శనివారం భువనేశ్వర్‌లో నిర్వహించిన అర్బన్ కాన్క్లేవ్‌లో హన్మకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, కూడా వైస్ చైర్ పర్సన్ చాహత్ బాజ్ పాయి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, కుడా పి ఓ అజిత్ రెడ్డి పాల్గొన్నారు ఈ సందర్భంగా నగరాల అభివృద్ధి ప్రణాళికలు, మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై నిర్వహించిన వివిధ ప్యానెల్ చర్చల్లో పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకున్నారు.ఈ కార్యక్రమంలో వరంగల్ నగరానికి అవార్డు లభించింది.జిల్లా కలెక్టర్,గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, కూడా వైస్ చైర్ పర్సన్ చాహత్ బాజ్ పాయి ఈ అవార్డును అందుకున్నారు. జిల్లా కి లభించిన ఈ గుర్తింపు. అభివృద్ధి దిశగా చేపడుతున్న కార్యక్రమాలకు మరింత ప్రోత్సాహాన్నిస్తుంది.

# స్వర్ణకార శంఖారావానికి దేవరకొండ స్వర్ణకారులు

### వృత్తి పరిరక్షణ.. హక్కుల సాధనే లక్ష్యం

### స్వర్ణకారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి






నీలగిరి వార్త -- దేవరకొండ: స్వర్ణకారుల వృత్తి పరిరక్షణ, సంక్షేమం, దీర్ఘకాలిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా స్వర్ణకార సంఘం ఇచ్చిన 'చలో హైదరాబాద్' పిలుపునకు దేవరకొండ స్వర్ణకారులు పెద్ద ఎత్తున స్పందించారు. స్వర్ణకార శంఖారావం కార్యక్రమంలో పాల్గొనేందుకు దేవరకొండకు చెందిన స్వర్ణకారులు శనివారం బస్సులో హైదరాబాద్‌కు బయలుదేరారు. సరూర్‌నగర్--ఎల్బీనగర్ ప్రాంతంలో నిర్వహించే భారీ బహిరంగ సభలో పాల్గొని, రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర కమిటీతో కలిసి పోరాటం కొనసాగిస్తామని వారు తెలిపారు.

స్వర్ణకారుల సమస్యలను పరిష్కరించాలి

ఈ సందర్భంగా దేవరకొండ స్వర్ణకార సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, తరతరాలుగా బంగారు ఆభరణాల తయారీని వృత్తిగా చేసుకుని జీవనం సాగిస్తున్న స్వర్ణకారులు నేడు అనేక ఆర్థిక, వృత్తిపరమైన సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తమ వృత్తిని కొనసాగించడం కష్టతరంగా మారుతోందని, స్వర్ణకార కుటుంబాలకు భద్రత కల్పించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

స్వర్ణకారుల సమస్యల పరిష్కారం కోసం ఎన్నో ఏళ్లుగా విజ్ఞప్తులు చేస్తున్నప్పటికీ, తమ డిమాండ్లకు తగిన ప్రాధాన్యం లభించడం లేదని తెలిపారు. అందుకే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న స్వర్ణకారులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, తమ సమస్యలను ప్రభుత్వానికి స్పష్టంగా తెలియజేసేందుకు స్వర్ణకార శంఖారావం నిర్వహిస్తున్నట్లు వివరించారు. తమ కోరికలు ప్రభుత్వం తీర్చలేనివి కావని, స్వర్ణకారుల జీవనోపాధి, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సానుకూలంగా స్పందించాలని కోరారు.

స్వర్ణకారుల ప్రధాన డిమాండ్లు ఇవే..

ప్రత్యేక స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి: స్వర్ణకారుల ఆర్థిక అభివృద్ధి, వృత్తి పరిరక్షణ, సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ ద్వారా స్వర్ణకార కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆర్థిక సహాయం, వృత్తి అభివృద్ధి కార్యక్రమాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.జీవో ఎంఎస్ నంబర్ 272ను సవరించి అమలు చేయాలి: స్వర్ణకారులకు సంబంధించిన జీవో ఎంఎస్ నంబర్ 272ను అవసరమైన విధంగా సవరించి సమర్థవంతంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో స్పష్టమైన విధివిధానాలను రూపొందించి, స్వర్ణకారులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

అక్రమ రికవరీలను అరికట్టాలి: స్వర్ణకారులు తమ వృత్తిని నిర్వహించే క్రమంలో ఎదుర్కొంటున్న అక్రమ రికవరీలను అరికట్టాలని డిమాండ్ చేశారు. వృత్తి చేసుకునే వారికి అనవసర ఇబ్బందులు కలగకుండా చట్టపరమైన రక్షణ కల్పించాలని కోరారు.50 ఏళ్లు నిండిన వృత్తిదారులకు నెలకు రూ.5,000 భృతి ఇవ్వాలి: వయస్సు పెరగడంతో పాటు వృత్తి ద్వారా ఆదాయం తగ్గి ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్వర్ణకారులను ఆదుకోవాలని తెలిపారు. 50 సంవత్సరాలు నిండిన అర్హులైన స్వర్ణకార వృత్తిదారులకు నెలకు రూ.5,000 భృతి అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. తద్వారా వృద్ధాప్యంలో స్వర్ణకార కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందని పేర్కొన్నారు.

బ్యాంకు రుణాల నిబంధనలను సరళీకరించాలి: బ్యాంకుల ద్వారా రుణాలు పొందే విషయంలో స్వర్ణకారులకు ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించాలని కోరారు. రుణాలపై సీలింగ్ విధానాన్ని తొలగించి, తమ డిమాండ్ మేరకు సమానమైన కమిషన్ విధానాన్ని అమలు చేయాలని తెలిపారు. స్వర్ణకారుల ఆర్థిక అవసరాలను గుర్తించి బ్యాంకులు అనుకూలమైన విధానాలను అనుసరించాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర కమిటీతో కలిసి ఉద్యమం

హైదరాబాద్‌లో జరిగే భారీ బహిరంగ సభలో దేవరకొండ స్వర్ణకారులు పాల్గొని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న స్వర్ణకారుల ఐక్యతను చాటుతామని సంఘం ప్రతినిధులు తెలిపారు. తమ వృత్తిని కాపాడుకోవడం, భవిష్యత్ తరాలకు ఉపాధి అవకాశాలను నిలబెట్టడం, స్వర్ణకార కుటుంబాలకు సామాజిక భద్రత కల్పించడం తమ ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు.స్వర్ణకారుల డిమాండ్లను ప్రభుత్వం పరిశీలించి, వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలని కోరారు. తమ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర కమిటీతో సమన్వయంతో పనిచేస్తామని, స్వర్ణకారుల హక్కుల సాధనలో ఐక్యంగా ముందుకు సాగుతామని వెల్లడించారు.

బస్సులో బయలుదేరిన స్వర్ణకార సంఘం నాయకులు

దేవరకొండ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరిన వారిలో స్థానిక స్వర్ణకార సంఘం అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి, గౌరవ అధ్యక్షుడు, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు. స్వర్ణకారుల వృత్తి పరిరక్షణకు, సంక్షేమానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, తమ డిమాండ్ల సాధన కోసం నిర్వహిస్తున్న స్వర్ణకార శంఖారావం విజయవంతం కావాలని వారు ఆకాంక్షించారు. స్వర్ణకారుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు, వృత్తిదారులకు భృతి, జీవో సవరణ, రుణ సదుపాయాల మెరుగుదల వంటి అంశాలపై తగిన నిర్ణయాలు తీసుకుంటే వేలాది స్వర్ణకార కుటుంబాలకు మేలు జరుగుతుందని సంఘం ప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## నూతన క్రిమినల్ చట్టాలపై సాయుధ దళాల సిబ్బందికి శిక్షణ.

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త. తెలంగాణ రాష్ట్ర డిజిపి సి.వి. ఆనంద్ గారి సూచన మేరకు, వరంగల్ పోలీస్ కమిషనరేట్ లోని సాయుధ బలగాల సిబ్బందికి నూతన క్రిమినల్ చట్టాల పట్ల అవగాహన కల్పించుటకు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఐ.పి.ఎస్. కార్యాచరణ చేపట్టారు.

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సాయుధ బలగాల విబాగంలో కానిస్టేబుల్ నుండి కమాండెంట్ వరకు గల మొత్తం 971 సిబ్బందిని 20 బ్యాచ్ లు గా విభజించి, రోజుకు ఒక బ్యాచ్ చొప్పున మడికొండ లోని కమిషనరేట్ పోలీస్ శిక్షణ కేంద్రం లో శిక్షణ ఇచ్చుటకు కు ప్రణాళికా రూపొందించారు. అందులో భాగంగా శనివారం రోజున మొదటి బ్యాచ్ కి పోలీస్ శిక్షణ కేంద్రం వైస్ ప్రిన్సిపల్, ఎసిపి రమణబాబు గారి పర్యవేక్షణలో శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా సిబ్బందికి నూతన చట్టాల పైన అవగాహన, ఎఫ్ఐఆర్ నమోదు, అరెస్టు సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, నేర స్థలంలో సాక్షాదారాల సేకరణ, ధర్నాల నిర్వహణ, ముందస్తు అరెస్టులు, నేరాల విభజన, మహిళలపై జరిగే నేరాలు, టెర్రరిస్టు చట్టాలు, సైబర్ నేరాలు, నేర విచారణలో పోలీసులకు ఉన్న అధికారాలు మొదలగు అంశాల పట్ల శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లా శిక్షకులు ఇన్స్పెక్టర్ సూర్యప్రకాశ్, సహాయక లా శిక్షకులు సబ్-ఇన్స్పెక్టర్ లు విజయ్, దేవేందర్, ఆర్ఐ ఉదయబాస్కర్, ఆర్ ఎస్సై రమేష్ మరియు శిక్షణ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



## రోటరీ ఆధ్వర్యంలో పల్స్ పోలియో నిర్మూలన అవగాహన ర్యాలీ

### "ఎండ్ పోలియో నౌ" హోర్డింగ్ ఆవిష్కరణ.

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ ఆధ్వర్యంలో "ప్రపంచ పోలియో దినోత్సవం" సందర్భంగా "పోలియో నిర్మూలన" అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా "ఎండ్ పోలియో నౌ" అవగాహన హోర్డింగును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులుగా అసిస్టెంట్ గవర్నర్ శారు ప్రభాకర్ రెడ్డి, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ రవిప్రకాష్, జిడబ్ల్యుఎంసి ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్ పాల్గొన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు అనంతుల కుమారస్వామి, కార్యదర్శి చందా రఘువీర్, కోశాధికారి చెరుకు రాజేందర్ రెడ్డి, ప్రోగ్రాం ఛైర్మన్ గంగిశెట్టి పూర్ణచందర్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రపంచ పోలియో దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలియో నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, చిన్నారులను పోలియో మహమ్మారి నుంచి రక్షించడంలో టీకాల ప్రాముఖ్యతను తెలియచేయడానికి క్లబ్ ఆధ్వర్యంలో "పోలియో నిర్మూలన" అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు అనంతుల కుమారస్వామి తెలిపారు. శనివారం ఉదయం 7 గంటలకు వరంగల్‌లోని ఎస్.బిఐ మెయిన్ బ్రాంచ్ వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ చౌరస్తా మీదుగా హెడ్ పోస్ట్ ఆఫీస్ వరకు వెళ్లి తిరిగి ఎస్.బిఐ మెయిన్ బ్రాంచ్‌కు చేరుకుంది. ఈ కార్యక్రమంలో రోటేరియన్లు ఉత్సాహంగా పాల్గొని పోలియో రహిత ప్రపంచం కోసం ప్రజలకు అవగాహన కల్పించారు.

ప్రపంచ వ్యాప్తంగా పోలియో నిర్మూలన కోసం




రోటరీ ఇంటర్నేషనల్ చేస్తున్న నిరంతర కృషిని ఈ సందర్భంగా చాటిచెప్పారు. ర్యాలీ అనంతరం ఎస్.బి.ఐ మెయిన్ బ్రాంచ్ పక్కనే ఉన్న ఆకారపు పెట్రోల్ పంప్ వద్ద "ఎండ్ పోలియో నౌ" అవగాహన హోర్డింగ్‌ను ఆవిష్కరించారు. రోటరీ క్లబ్ సభ్యులు ర్యాలీలో నినాదాలిస్తూ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నవంబర్ 6న నా ఉర్సు గుట్ట వద్ద జరిగే నరకాసుర వధ కార్యక్రమానికి.

వరంగల్ డీసీపీ రాయల ప్రభాకర్ ను ఆహ్వానించిన నిర్వాహక కమిటీ సభ్యులు.




వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.నవంబర్ 6 వ తారీఖున దీపావళి పండుగ సందర్భంగా జరుగు నరకాసుర వద ఉత్స వాలలో పాల్గొనే వాహనదారు లకు ప్రజలకు ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ట్రాఫిక్ ను నియంత్రించడానికి తగు ఏర్పాటు చేస్తామని వరంగల్ నగర అడిషనల్ డీసీపీ ట్రాఫిక్ రాయల ప్రభాకర్ రావు అన్నారు శనివారం రోజున నరకాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షులు మరుపల్ల రవి ఆధ్వర్యంలో వారికి పూల మొక్కను అందజేసి శాలువా కప్పి వినతి పత్రం ఆహ్వాన పత్రికలను అందజేశారు నరకాసురవద ఉత్సవములు ఉర్సు గుట్ట కూడా మైదానం లో సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 9:30 వరకు ఉత్సవాలు జరుగుతాయని ఇట్టి ఉత్సవాలను తిలకించడానికి ప్రజా ప్రతినిధులు వివిధ రాజకీయ పార్టీల నాయకులు జిల్లా ఉన్నతాధికారులు వేలాదిమంది ప్రజలు వాహనాలలో విచ్చేస్తారని నరకాసుర వద ఉత్సవ కమిటీ అధ్యక్షులు మరుపల్ల రవి అడిషనల్ డీసీపీ రాయల ప్రభాకర్ కు వివరించినారు అడిషనల్ డీసీపీ రాయల ప్రభాకర్ మాట్లాడుతూ నరకాసుర వధ ఉత్సవాలు పెద్ద ఎత్తున జరుగుతున్నందున వాహనదారులు ప్రజలు ఇబ్బందులు పడకుండా ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేస్తామన్నారు వినతిపత్రం ఆహ్వాన పత్రిక అందజేసిన వారిలో నరకాసుర వద ఉత్సవ కమిటీ ప్రతినిధులు మరుపల్ల గౌతం దూడే బాలకోమురెల్లి వనం కుమార్ కుండె రాజు ఆవునూరు ఐలేశం దాసరి రాజు కుండే సదానందం లు ఉన్నారు.

## పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి..

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్, జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి..



శేరిలింగంపల్లి నీలగిరి వార్త .. భారతీయ జనతా పార్టీ ఆధ్వ ర్యంలో మసీద్ బండ బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలిం గంపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ రవికుమార్ యాదవ్, జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు గడువు ముగియడానికి మరో 10 రోజులు మాత్రమే మిగిలి ఉందని, కార్యకర్తలు యుద్ధప్రాతిపదికన రంగంలోకి దిగి అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఓటరు నమోదు ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు, శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో ప్రత్యేకంగా సహాయక బృందాలను (టీమ్స్) ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. పట్టభద్రులు తమ పేర్లను నమోదు చేసుకునేందుకు ఈ బృందాలు అన్ని విధాలా సహకరిస్తాయని, ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు, విద్యావంతులు, పట్టభద్రుల సమస్యలపై భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉండి పోరాడుతోందని గుర్తుచేశారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీని గెలిపించేందుకు ప్రతి డివిజన్, బూత్ స్థాయి నాయకులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. గ్రాడ్యుయేట్ ఓటర్ నమోదుకు గడువు సమీపిస్తున్నందున, ఇంటింటికీ తిరిగి పట్టభద్రులను గుర్తించి దరఖాస్తులు పూర్తి చేయించే బాధ్యతను కార్యకర్తలు తీసుకోవాలన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విజయానికి ఇప్పటినుంచే పటిష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, డివిజన్ స్థాయి ముఖ్య నాయకులు, మోర్చాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి కి దసరా శుభాకాంక్షలు తెలిపిన పి ఎ సి చైర్మన్ గాంధీ, శేరిలింగంపల్లి మాజీ కార్పొరేటర్ లు..



శేరిలింగంపల్లి నీలగిరి వార్త .. దసరా పండుగ సందర్భం గా చేవెళ్ల పార్లమెంట్ మాజీ సభ్యులు గడ్డం రంజిత్ రెడ్డి ని వారి నివా సంలో తాజా మాజీ కార్పొ రేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్ , రాగం నాగేందర్ యాదవ్ , నార్నె శ్రీనివాస రావు , ఉప్పలపాటి శ్రీకాంత్ , సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి , నాయకులతో మర్యాదపూర్వకంగా కలిసి దసరా పర్వదిన శుభాకాంక్షలు తెలియచేసిన చైర్మన్ ఆరెకపూడి గాంధీ .ఈ కార్యక్రమంలో నాయకులు దొడ్ల రామకృష్ణ గౌడ్, సమ్మారెడ్డి, శివరాజు గౌడ్, సంజీవ రెడ్డి, గణేష్ ముదిరాజు, అక్తర్, మారబోయిన రాజు యాదవ్,నాయి నేని చంద్రకాంత్ రావు, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, బాలింగ్ గౌతమ్ గౌడ్ ,మంత్రిప్రగడ సత్యనారాయణ,అక్బర్ ఖాన్, నాగరాజు, శశాంక్ తదితరులు.

# చండూరులో ఘనంగా భూతరాజు రామయ్య 45వ వర్ధంతి

ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి రెండెకరాల భూమి దానం చేసిన మహనీయుడు

నేటికీ ప్రజలకు అందుతున్న వైద్యసేవల వెనుక రామయ్య త్యాగం



చండూరు, నీలగిరి వార్తా ప్రతినిధి :అక్టోబర్ 24:
ప్రజల ఆరోగ్య అవసరాలను గుర్తించి ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి రెండెకరాల విలువైన భూమిని దానం చేసిన మహనీయుడు భూతరాజు రామయ్య సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. సమాజ శ్రేయస్సు కోసం తన ఆస్తిని సైతం ప్రజాప్రయోజనాలకు అంకితం చేసిన ఆయన దాతృత్వం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. భూతరాజు రామయ్య 45వ వర్ధంతి వేడుకలను శనివారం చండూరులో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానిక ప్రముఖులు రామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. చండూరు ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి రెండెకరాల భూమిని దానం చేయడం గొప్ప విషయమని కొనియాడారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చండూరు ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ మాసరాజు మాట్లాడుతూ.. భూతరాజు రామయ్య చేసిన భూదానం ఎందరో పేదలకు వైద్యసేవలు అందించేందుకు దోహదపడిందని పేర్కొన్నారు. ఆయన దాతృత్వంతో అందించిన స్థలంలో నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రి ద్వారా నేటికీ చండూరు పరిసర ప్రాంతాల ప్రజలకు వైద్యసేవలు అందుతున్నాయని తెలిపారు. నిస్వార్థంగా ప్రజల కోసం ఆస్తిని దానం చేసిన రామయ్య సేవలు ఎప్పటికీ ప్రజల హృదయాల్లో నిలిచిపోతాయని అన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు.భూతరాజు రామయ్య 45వ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామయ్య చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ ఆయన త్యాగం చండూరు ప్రాంత ప్రజలకు ఎంతో మేలు చేసిందని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను భావితరాలకు తెలియజేస్తూ, సేవా స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో భూతరాజు వెంకటేశం, యాదయ్య నారాయణ, భూతరాజు స్రవంతి రమేష్, మురళి, వేణు, రామకృష్ణ, మణికంఠ, భూతరాజు హేహన్ష్, పగిళ్ల స్రవంతి, రెవల్లి వెంకటేశ్, కొమ్మనపల్లి దశరథ తదితరులు పాల్గొన్నారు.

# యలమంచి ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం..

400 మందికి పైగా ప్రజలకు ఉచిత వైద్య సేవలు సేవలను అభినందించిన జగదీశ్వర్ గౌడ్..





మియాపూర్ నీలగిరి వార్త .. యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, మమతా అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ హాస్పిటల్ సహకారంతో జయప్రకాశ్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో 400 మందికి పైగా ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు, వైద్యుల సలహాలు, మందులు అందించడంతో పాటు రవాణా సౌకర్యం కల్పించారు.
కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ, పేదలకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని, ఎంటెక్ గోల్డ్ మెడలిస్ట్ అయిన ఉదయ్ కిరణ్ సేవా కార్యక్రమాలు యువతకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. సోషల్ మీడియా ఇన్స్టాగ్రామ్ లో 60 కె ఫాలోవర్స్ కలిగి ఉన్న ఉదయ్ కిరణ్ రికార్డ్ సృష్టించారు. మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీగా ఉన్న ఉదయ్ కిరణ్ విద్య, వైద్యం, యువజన అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, పేదల సంక్షేమం కోసం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ ప్రజలతో అనుసంధానమవుతున్నారు.ఈ సందర్భంగా ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యం, సంక్షేమమే తమ లక్ష్యమని,భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. శిబిరం విజయవంతానికి సహకరించిన ఆసుపత్రి యాజమాన్యం, దాతలు, జేపీ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, నాయకులు, వాలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా ఆంజనేయ స్వామి ఆలయ 15 వ వార్షికోత్సవ వేడుకలు..

పాల్గొన్న హఫీజ్ పేట్ బిజెపి కంటెస్టెడ్ కార్పొరేటర్ అనూషా మహేష్ యాదవ్..



శేరిలింగంపల్లి నీలగిరి వార్త... మియాపూర్ డివిజన్ పరిధిలోనీ మియాపూర్ న్యూ కాలనీలో విజయ వినాయక యూత్ అసోసియేషన్,ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంజనేయస్వామి దేవాలయ 15వ వార్షికోత్సవ వేడుకల్లో బీజేపీ హఫీజ్‌పేట్ కంటెస్టెడ్ కార్పొరేటర్ బోయిని అనుషా మహేష్ యాదవ్ పాల్గొన్నారు. ఈసందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం నిర్వహి ంచిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు సేవలంది ంచారు.భక్తి, సేవాభావం, ఐకమత్యానికి ప్రతీకగా నిలిచే ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని ఆమె పేర్కొన్నారు. సమాజంలో ఆధ్యాత్మిక విలువలను పెంపొందించడంతో పాటు సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల మధ్య సోదరభావం, ఐక్యత మరింత బలోపేతం అవుతాయని తెలిపారు.
ఈ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించిన విజయ వినాయక యూత్ అసోసియేషన్ నిర్వాహకులకు, కమిటీ సభ్యులకు ఆమె అభినందనలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో బోయిని కిషోర్ యాదవ్, మియాపూర్ డివిజన్ అధ్యక్షులు ఆకుల లక్ష్మణ్ ముదిరాజ్, విజేందర్, పవన్, లక్ష్మణ్, సాయి యాదవ్ పెద్ద సంఖ్యలో యువత మహిళలు పాల్గొన్నారు.

## జన్మదినం జరుపుకున్న ఎమ్మెల్యే కేపీ వివేకానందకు ఆవుల ఆదినారాయణ రెడ్డి శుభాకాంక్షలు

శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసిన టెంట్ హౌస్ ఓనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు



నీలగిరి వార్త కుత్బుల్లాపూర్ ప్రతినిధి టి రమేష్ కుత్బుల్లాపూర్ నియోజ కవర్గ శాసనసభ్యుడు కేపీ వివేకానంద గౌడ్‌కు దసరా పండుగ రోజున జన్మదినం సందర్భంగా పలువురు ప్రముఖులు, నాయకులు శుభాకాంక్షలు తెలియజేశా రు. ఈ క్రమంలో కుత్బుల్లా పూర్ టెంట్ హౌస్ ఓనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రముఖ వ్యాపారవేత్త, సామాజికవేత్త ఆవుల ఆదినారాయణ రెడ్డి ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజాసేవలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలి

ఈ సందర్భంగా ఆవుల ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చూపిస్తున్న చొరవ, నియోజకవర్గ అభివృద్ధి కోసం చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. భగవంతుడు ఎమ్మెల్యేకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని, నిండు నూరేళ్లు ప్రజలకు సేవ చేస్తూ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో టెంట్ హౌస్ ఓనర్ల అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లా బీజేవైఎం అర్బన్ వైస్ ప్రెసిడెంట్‌గా పంతంగి హర్ష యాదవ్ నియామకం



నీలగిరి వార్త కుత్బుల్లాపూర్ ప్రతినిధి టి రమేష్ భారతీయ జనతా పార్టీ యువజన విభాగమైన భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) రంగారెడ్డి అర్బన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా పంతంగి హర్ష యాదవ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా పంతంగి హర్ష యాదవ్ మాట్లాడుతూ, తన నియామకానికి సహకరించిన శేరిలింగంపల్లి మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి రవికుమార్ యాదవ్, బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాసరెడ్డికి, రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి తోపుకొండ మైపాల్ రెడ్డికి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కుందే గణేష్‌కు, జిల్లా యువమోర్చా అధ్యక్షుడు పొట్లపల్లి సాయికుమార్ గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని, యువతను పార్టీ సిద్ధాంతాల వైపు ఆకర్షిస్తూ బీజేవైఎంను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని హర్ష యాదవ్ పేర్కొన్నారు. యువత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, భారతీయ జనతా పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు.

## అధికారులకు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించండి

### వాటర్ వర్క్స్ అధికారులకు సిపిఐ వినతి పత్రం

### ఎల్నీనో కారణంగా రాబోవు రోజుల్లో నీటి ఎద్దడి



నీలగిరి వార్త కుత్బుల్లాపూర్ ప్రతినిధి టి రమేష్ తీవ్రంగా ఉంటుంది కాబట్టి ప్రజలను అప్రమత్తత చేయడానికి, నీటి వృధాను అరికట్టడానికి వాటర్ వర్క్స్ అధికారులు అన్ని బస్తీలలో పర్యటించి ప్రజలను చైతన్యపరిచి నీటిని వృధా చేయకుండా చూడాలని నేడు సిపిఐ ఆధ్వర్యంలో చింతల్ సర్కిల్ వాటర్ వర్క్స్ డిప్యూటీ జనరల్ మేనేజర్ వికాస్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ ,రాష్ట్ర నాయకులు ఏసురత్నం గారు మాట్లాడుతూ బస్తీలలో మంచినీరు సరఫరా చేసే సమయంలో అధికారులు పర్యటించి ఎవరైతే నీరు వృధా చేస్తున్నారో వారికి జరిమానా విధిస్తే నీటిని వృధా చేసే మిగతా ప్రజలు కూడా భయపడి నీటిని వృధా చేయకుండా ఉంటారని అన్నారు. రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే అనేకసార్లు ప్రజలకు విజ్ఞప్తి చేశారని , నీటి వృధానీ అరికట్టాల్సిన వాటర్ వర్క్స్ అధికారులు అధికారులు కూడా ప్రకటనలకే పరిమితమైతే సరిపోదని వెంటనే క్షేత్రస్థాయి పర్యటనలు మొదలుపెట్టాలని అదేవిధంగా అక్రమంగా నడుస్తున్న వాటర్ ప్లాంట్లను కూడా మూసివేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు గిరి నగర్ మరియు జగద్గిరి గుట్టలో వివిధ ప్రాంతాలలో వివిధ బస్తీలలో ఎక్కడెక్కడ నీరు వృధాగా పోతుందో వాటి వివరాలను వాటర్ వర్క్స్ అధికారులకు ఇవ్వడం జరిగింది. వారం రోజుల్లోపు సిపిఐ ఇచ్చిన డిమాండ్లను పరిష్కరించాలని లేనిపక్షంలో అధికారుల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వి శ్రీనివాస్ సిపిఐ మండల కార్యదర్శి కే స్వామి సహాయ కార్యదర్శి హరినాథ్ రావు ప్రజానాట్య మండల అధ్యక్షులు బాబు యువజన సంఘం అధ్యక్ష కార్యదర్శులు ప్రవీణ్, కీర్తి శాఖ కార్యదర్శి వెంకటేష్, యాకూబ్, సిపిఐ నాయకులు ఇమామ్ యాదన్న, సాగర్, రాజేష్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన నియామక ప్రక్రియను రీఓపెన్ చేయడం చెల్లదు




హైదరాబాద్, అక్టోబరు 24 అప్పటికే ముగిసిన నియామక ప్రక్రియను మళ్లీ తెరిచి, చట్టబద్ధంగా సర్వీసులో చేరిన ఓ ప్రభుత్వ ఉద్యోగిని తొలగించలేరని హైకోర్టు పేర్కొంది. డీఎస్సీ-2024 నియామకాల్లో భాగంగా అప్పటి మెరిట్ జాబితా ప్రకారం సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ)గా ఎంపికై, పదినెలలు సర్వీసు కూడా చేసిన తర్వాత చెప్పాపెట్టకుండా ఆ వ్యక్తిని ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగించడం చట్టవిరుద్ధమని తేల్చి చెప్పింది. సబావట్ వీణ అనే ఉపాధ్యాయురాలిని అన్ని ప్రయోజనాలతో మళ్లీ సర్వీసుల్లోకి తీసుకోవాలని ఆదేశించింది. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట్ మండలం మోరబావి ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న వీణను టర్మినేట్ చేస్తూ డీఈవో జారీ చేసిన ఉత్తర్వులను కొట్టివేసింది. డీఎస్సీ నియామకాల సందర్భంగా ఆమె కంటే మెరుగైన ర్యాంకు వచ్చిన మరో అభ్యర్థిపై క్రిమినల్ కేసు ఉండడంతో ఆ వ్యక్తిని ఉద్యోగంలోకి తీసుకోలేదు. తర్వాత ఆ కేసును కోర్టు కొట్టేయడంతో ఆ అభ్యర్థి నిర్దోషిగా బయటపడ్డారు. ఈ నేపథ్యంలో మెరుగైన ర్యాంకు వచ్చిందన్న కారణంతో డీఈఓ ఆ అభ్యర్థికి ఉద్యోగం ఇచ్చి, వీణను తొలగించారు. దీనిని సవాలు చేస్తూ హైకోర్టులో ఆమె దాఖలు చేసిన జస్టిస్ కే శరత్ ధర్మాసనం విస్తృతంగా పరిశీలన జరిపింది. వీణకు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా తొలగించడం అక్రమమని పేర్కొంది. ఎనిమిది వారాల్లో అన్ని సర్వీసు ప్రయోజనాలతో తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలని స్పష్టం చేసింది.

# కరువు వస్తుందని ముందే చేతులెత్తేస్తారా?

### ప్రజలకు ఇచ్చిన హామీల మాటేమిటి?

### కాంగ్రెస్ ప్రభుత్వం పై నరేందర్ రెడ్డి ఫైర్

### కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు, ప్రజలకు సమాధానం చెప్పాలి

### బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి



నీలగిరి వార్త కుత్బుల్లాపూర్ ప్రతినిధి టి రమేష్ కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాలను సాకుగా చూపి కాంగ్రెస్ ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పించుకోవాలని చూస్తోందని జీడిమెట్ల 132 డివిజన్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి విమర్శించారు. ఎల్‌నినో ప్రభావం ఉన్నా, కరువు పరిస్థితులు ఎదురైనా రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. నీటి కొరత ఏర్పడే అవకాశాలు ఉన్న ప్పుడు ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, సమస్యలు వస్తాయని ముందే చెప్పి చేతులెత్తేయడం సరికాదన్నారు. రైతులు, సామాన్య ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం తక్షణమే కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలో రైతులకు అండగా నిలిచాం అని అన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మిషన్ కాకతీయ, సాగునీటి ప్రాజెక్టులు, రైతుబంధు, ఉచిత విద్యుత్ వంటి కార్యక్రమాలతో రైతులకు అండగా నిలిచామని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా సాగునీరు, తాగునీటి సమస్యలపై ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

**ఆరు గ్యారెంటీల అమలుపై స్పష్టత ఇవ్వాలి**

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుబంధు స్థానంలో రైతుభరోసా, పంట రుణమాఫీ, ఉచిత విద్యుత్‌తో పాటు ఆరు గ్యారెంటీల అమలు పరిస్థితిని స్పష్టం చేయాలన్నారు. కరువు పరిస్థితులను సాకుగా చూపి హామీలను పక్కనపెట్టడం సరికాదని అన్నారు.

**రైతులకు అన్యాయం జరిగితే బీఆర్ఎస్ పోరాడుతుంది**

రైతులు సాగునీటి కోసం, ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నరేందర్ రెడ్డి కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని తెలిపారు. ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.

# జన్మదినం జరుపుకున్న ఎమ్మెల్యే కేపీ వివేకానందకు ఆవుల ఆదినారాయణ రెడ్డి శుభాకాంక్షలు

### శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసిన టెంట్ హౌస్ ఓనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు



నీలగిరి వార్త కుత్బుల్లాపూర్ ప్రతినిధి టి రమేష్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ శాసనసభ్యుడు కేపీ వివేకానంద గౌడ్‌కు దసరా పండుగ రోజున జన్మదినం సందర్భంగా పలువురు ప్రముఖులు, నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ క్రమంలో కుత్బుల్లాపూర్ టెంట్ హౌస్ ఓనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రముఖ వ్యాపారవేత్త, సామాజికవేత్త ఆవుల ఆదినారాయణ రెడ్డి ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలి ఈ సందర్భంగా ఆవుల ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చూపిస్తున్న చొరవ, నియోజకవర్గ అభివృద్ధి కోసం చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. భగవంతుడు ఎమ్మెల్యేకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని, నిండు నూరేళ్లు ప్రజలకు సేవ చేస్తూ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టెంట్ హౌస్ ఓనర్ల అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర బిజెపి రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా

### చలో హైదరాబాద్ ను జయప్రదం చెయ్యండి

### సీఐటీయూ రాష్ట్ర.ఉపాధ్యక్షులుజె.మల్లికార్జున్







నీలగిరి వార్త కుత్బుల్లాపూర్ ప్రతినిధి టి రమేష్ సిఐటియు కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర బిజెపి రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 25 26వ తారీకులలో ఇందిరాపార్కు వద్ద జరిగే 48 గంటల మహాధర్నా ను జయప్రదం చేయాలని షాపూర్ నగర్ రైతు బజార్ నుండి ఉషోదయ టవర్స్ వరకు సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె. మల్లికార్జున్. సిఐటియు జిల్లా కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్. మండల కన్వీనర్ కీలుకానీ లక్ష్మణ్. పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలోని సుమారు రెండు కోట్ల మంది సంఘటిత అసంఘటిత కార్మికులు శ్రమదోపిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్మిక వర్గం కదంతొక్కాల్సిన తరుణం ఆసన్నమైందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఏర్పడిందని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ దేశ సంపదను కార్మికుల శ్రమను కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ మన హక్కులను కాలరాస్తున్నారన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లు తెచ్చింది ఈ నాలుగు లేబర్ కోడ్లు కార్మికులను కట్టు బానిసలుగా చేసేవి ఈ నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని ప్రభుత్వానికి గుండెకాయ లాగా పనిచేస్తున్న ప్రభుత్వరంగ సంస్థలను కేంద్ర బీజేపీ ప్రభుత్వం ధ్వంసం చేస్తుందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడం మన అందరి హక్కు అని అన్నారు కనీస వేతనాల పెరుగుదల కనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచకుండా కార్మికుల శ్రమను దోచుకోవడానికి పెట్టుబడుదారి వర్గానికి స్వేచ్ఛనిచ్చింది కేంద్ర కనీస వేతనాల సలహాల మండలిలో కార్మిక హక్కుల కోసం పోరాడే కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం ఇవ్వకుండా ప్రభుత్వాల కనుకూలంగా వంతపాడే కార్మిక సంఘాలకు అవకాశం కల్పించింది ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సమావేశాలు జరపడం లేదన్నారు. స్కీం వర్కర్లను కార్మికులు గా గుర్తించడం లేదని 12 సంవత్సరాలలో 25 లక్షల కోట్ల ప్రజాధనాన్ని బడా పెట్టుబడిదారులకు కార్పొరేట్ సంస్థలకు దార పోసి కార్మిక ఉద్యమాల పట్ల ఉక్కు పాదం మోపుతుందని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక. ప్రజా సమస్యల పరిష్కరించడంలో బిజెపి అడుగుజాడల్లో నడుస్తున్నదని నాలుగు లేబర్ కోడ్లను వ్యతిరేకించకుండా వాటిని రూల్స్ రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో స్టాప్ ఎస్టాబ్లిషెన్ లేబర్ యాక్ట్ పరిధిలోని సంస్థల్లో 10 గంటల పని విధానం తెచ్చింది. ఈ జీవో ను కార్మిక సంఘాలతో ఎలాంటి చర్చ చేయకుండా జీవో విడుదల చేసిందని ఆరోపించారు . ప్రభుత్వ ఉద్యోగులకు పిఆర్సి లేదు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు పర్మినెంట్ మాట లేదు స్క్రీన్ వర్కర్లు అంగన్వాడీ ఆశ మధ్యాహ్న భోజనం వీళ్ళ జీతాల పెంపు మాట లేదు రాష్ట్రంలో కార్మిక వర్గానికి అన్యాయం చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుంది. జీవో నెంబర్ 6 ని విడుదల చేసింది. కానీ జీవో నెంబర్ 6 ను అమలు చేయని యాజమాన్యాలపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు . ఏ యాజమాన్యం కూడా జీవో నెంబర్ 6 ని అమలు చేయడం లేదనీ అన్నారు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులను పట్టించుకోవడంలో పూర్తిగా విఫలమైందని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు సమానంగా పనిచేస్తున్న ఫిక్స్ నాన్ రెగ్యులర్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదు కాంటాక్ట్,అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు స్కీం వర్కర్లకు కూడా డిఏ అమలు చేయాలన్నారు. అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రతను కల్పించాలని, అదేవిధంగా కార్మికులకు వెల్ఫేర్ బోర్డు నుండి 58 సంవత్సరాలు దాటినా ప్రతి కార్మికునికి నెలకు పెంక్షన్ పదివేల రూపాయలు ఇవ్వాలని స్కీం వర్కర్లపై రోజురోజుకీ పని భారం పెరుగుతుంది అధికారుల వేధింపులు ఎక్కువైపోతున్నాయి అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఆయుధంగా పనిచేస్తున్న స్కీమర్కర్లకు వారు కనీస వేతనాలు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రాష్ట్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పడం కోసం ఆశ,అంగన్వాడి, మధ్యాహ్న భోజన కార్మికులు అధిక మొత్తంలో కార్మిక వర్గం అంతా జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జీడిమెట్ల క్లస్టర్ కన్వీనర్ పి. అంజయ్య, మండల నాయకులు శ్రీను, దేవదానం, శ్రీశైలం, ఆంజనేయులు,గోపి మధు యాదవ రెడ్డి మల్లారెడ్డి దుర్గా నాయక్ వీరేష్ తదితరులు పాల్గొన్నారు.




# దుమ్మురేపిన జియో ఐపీవో..

## ముగిసిన మెగా పబ్లిక్ ఇష్యూ..

ముంబై, అక్టోబర్ 23 : జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) అదరగొట్టింది. శుక్రవారం ముగిసిన ఈ పబ్లిక్ ఇష్యూతో దేశ, విదేశీ ఐపీవో మార్కెట్లలో పాత రికార్డులు చెరిగిపోతే.. కొత్త రికార్డులు నమోదయ్యాయి. బుధవారం మొదలైన ఈ ఫ్రెష్ ఇష్యూకు అన్ని రకాల మదుపర్ల నుంచి విశేష స్పందన లభించింది మరి.

జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీవోలో మదుపర్ల నుంచి షేర్ల డిమాండ్ రూ.7.40 లక్షల కోట్లను దాటిపోయింది. ఇందులో పబ్లిక్ ఐపీవో బిడ్ల విలువ రూ.4.90 లక్షల కోట్లుగా ఉంటే.. యాంకర్ ఇన్వెస్టర్ల బిడ్ల విలువ రూ.2.50 లక్షల కోట్లుగా ఉన్నది. దీంతో భారతీయ క్యాపిటల్ మార్కెట్లలో ఇన్వెస్టర్ డిమాండ్‌కు ఇదో సరికొత్త బెంచ్‌మార్క్‌గా నిలిచింది.

ఈ పబ్లిక్ ఇష్యూ కోసం మొత్తం 1.39 కోట్ల దరఖాస్తులు వచ్చాయి. ప్రపంచ ఐపీవోల్లో ఇదే రికార్డు. అంతేగాక 2024 అక్టోబర్‌లో వచ్చిన భారతీయ ఐపీవో వారీ ఎనర్జీస్ 97.34 లక్షల దరఖాస్తుల రికార్డు చెరిగిపోయింది.

రూ.30,213 కోట్లతో దేశీయ అతిపెద్ద ఐపీవోగా జియో రికార్డు సృష్టించింది. మునుపు ఈ రికార్డు హ్యుందాయ్ మోటర్ ఇండియా (రూ.27,870 కోట్లు) పేరిట ఉండేది. జియో ఐపీవో షేర్ల ధరల శ్రేణి రూ.1,065-1,119.

జియో ప్లాట్‌ఫామ్స్.. క్యాపిటల్ మార్కెట్లలోకి దాదాపు రూ.10.30 లక్షల కోట్ల (109 బిలియన్ డాలర్లు) విలువతో ప్రవేశిస్తున్నది. ఫలితంగా భారత్‌లో ఓ ఐపీవోను ప్రారంభించిన అత్యంత విలువైన కంపెనీగా నిలిచింది. అంతేగాక దేశీయ స్టాక్ మార్కెట్లలో నమోదైన టాప్-5 విలువైన కంపెనీల్లో కూడా ఒకటిగా జియో ఉంటుందన్న అంచనాలున్నాయి.

ఈ ఐపీవోలో మొత్తం 27 కోట్ల షేర్లు జారీ అయితే 655.68 కోట్ల షేర్లకు డిమాండ్ వచ్చింది.

# ఇన్ఫీ లాభం 7,823 కోట్లు




న్యూఢిల్లీ, అక్టోబర్ 23 : దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన ఇన్ఫోసిస్ ఆకర్షణీయమైన ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను సంస్థ రూ.7,823 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. కిందటేడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.7,364 కోట్ల లాభంతో పోలిస్తే 6.2 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షాకాలంలో కంపెనీ ఆదాయం రూ.44,490 కోట్ల నుంచి 10.2 శాతం వృద్ధితో రూ.49,244 కోట్లకు చేరుకున్నట్టు ప్రకటించింది. మరోవైపు, మరోసారి గైడెన్స్‌ను నిరాశపరిచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తానికా ఆదాయంలో 1-2 శాతం వరకు మాత్రమే వృద్ధి నమోదయ్యే అవకాశాలున్నాయని అవుట్‌లుక్‌లో పేర్కొంది.

గతంలో అంచనావేసిన 1.5 శాతం నుంచి 3 శాతం కంటే ఇది తక్కువ. అంతర్జాతీయ దేశాల్లో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులకు తోడు విచక్షణతో చేసే ఖర్చులు తక్కువగా ఉండటం వల్లనే ఆదాయ అంచనాల్లో కోత పెట్టినట్టు కంపెనీ సీఈవో, ఎండీ సలీల్ పరేఖ్ తెలిపారు.

# వ్యాయామం చేస్తున్నారా..

## పొటాషియం ఉండే వీటిని తింటే మేలు..

శారీరక దృఢత్వాన్ని పెంచుకోవడానికి, ఎక్కువసేపు వ్యాయామం చేసే సామర్థ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి, మొత్తం ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ఎంతో అవసరం. అయితే, వ్యాయామం చేయడం ఒక్కటే సరిపోదు. కండరాల పనితీరును మెరుగుపరచడం, శరీరంలో ద్రవాల సమతుల్యతను కాపాడడం, శారీరక శ్రమ తర్వాత శరీరం కోలుకోవడంలో ఆహారం కూడా కీలక పాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా క్రమం తప్పకుండా వ్యాయామం చేసేవారు తమ ఆహారంలో తగినంత పొటాషియం ఉండేలా చూసుకోవాలి. పొటాషియం శరీరానికి అవసరమైన ముఖ్యమైన ఖనిజం. ఇది ఎలక్ట్రోలైట్‌గా పనిచేస్తూ కండరాలు సంకోచించడానికి, నరాల ద్వారా సంకేతాలు ప్రసారం కావడానికి, శరీరంలో ద్రవాల సమతుల్యతను నిర్వహించడానికి సహాయపడుతుంది. వ్యాయామం చేస్తున్నప్పుడు కండరాలు సక్రమంగా పనిచేయడానికి శరీరంలోని ఎలక్ట్రోలైట్లు సమతుల్యంగా ఉండాలి. ఈ ప్రక్రియలో పొటాషియం కీలక పాత్ర పోషిస్తుంది.

**సమతుల్య ఆహారం ముఖ్యం..**

చెమట ద్వారా కొంత పొటాషియం శరీరం నుంచి బయటకు వెళ్తుంది. అయితే, ఎంత పరిమాణంలో కోల్పోతామన్నది వ్యాయామ తీవ్రత, దాని వ్యవధి, వాతావరణ ఉష్ణోగ్రత, వ్యక్తిగతంగా చెమట పట్టే తీరుపై ఆధారపడి ఉంటుంది. చాలామందికి పొటాషియం సమృద్ధిగా ఉండే ఆహారాలను సమతుల్య ఆహారంలో చేర్చుకోవడం ద్వారా రోజువారీ అవసరాలను తీర్చుకోవచ్చు. ఇందుకోసం ప్రత్యేకంగా పోషకాహార అనుబంధాలను తీసుకోవాల్సిన అవసరం సాధారణంగా ఉండదు. నరాలు, కండరాల మధ్య సమాచార ప్రసారానికి అవసరమైన విద్యుత్ సంకేతాలను నిర్వహించడంలో పొటాషియం కీలక పాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా



సోడియం వంటి ఇతర ఎలక్ట్రోలైట్లతో కలిసి కణాల పొరల మీదుగా విద్యుత్ ఆవేశాల కదలికను నియంత్రిస్తుంది. కండరాలు సాధారణంగా సంకోచించడం, తిరిగి విశ్రాంతి స్థితికి రావడం వంటి ప్రక్రియలకు ఇది అవసరం.

పొటాషియం ఎందుకు అవసరం..బరువులు ఎత్తడం, పరుగెత్తడం, సైక్లింగ్ చేయడం లేదా శరీర బరువుతో వ్యాయామాలు చేయడం వంటి కార్యకలాపాల్లో కండరాలు పదేపదే సంకోచించి శక్తిని ఉత్పత్తి చేస్తాయి. కణాల్లో ద్రవాల సమతుల్యతను కాపాడడంతోపాటు నరాల సాధారణ పనితీరుకు కూడా పొటాషియం తోడ్పడుతుంది. ఆహారం ద్వారా తగినంత పొటాషియం అందకపోతే కండరాల పనితీరు ప్రభావితమవుతుంది. రక్తంలో పొటాషియం స్థాయిలు గణనీయంగా తగ్గితే ఆ పరిస్థితిని హైపోకలేమియా అంటారు. దీనివల్ల కండరాల బలహీనత, కండరాల తిమ్మిర్లు ఏర్పడతాయి. తీవ్రమైన సందర్భాల్లో గుండె స్పందనలో ప్రమాదకరమైన అసమతుల్యత కూడా సంభవిస్తుంది. అయితే, కండరాల తిమ్మిర్లు వస్తున్నాయంటే పొటాషియం లోపం ఉందని నిర్ధారించలేం. కండరాల అలసట సహా అనేక కారణాల వల్ల కూడా తిమ్మిర్లు వస్తాయి. అందువల్ల పొటాషియం తీసుకోవడం పెంచినంత మాత్రాన తిమ్మిర్లు తప్పనిసరిగా తగ్గుతాయని చెప్పలేం.

ప్రత్యేక శ్రద్ధ అవసరం..శారీరక శ్రమ చేస్తున్నప్పుడు కండరాలు సంకోచించే ప్రక్రియలో భాగంగా పొటాషియం కండరాల కణాల నుంచి రక్తప్రవాహంలోకి కదులుతుంది. చెమట ద్వారా కూడా కొంత పొటాషియం బయటకు వెళ్తుంది. అయితే, చెమట పట్టే పరిమాణం, అందులో ఉండే పొటాషియం స్థాయిలను బట్టి ఈ నష్టం మారుతుంది. మూత్రపిండాలు, ఇతర శారీరక నియంత్రణ వ్యవస్థలు సాధారణంగా శరీరంలోని పొటాషియం స్థాయిలను సమతుల్యంగా ఉంచేందుకు పనిచేస్తాయి. క్రమం తప్పకుండా వ్యాయామం చేసేవారు సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన పొటాషియాన్ని అందించవచ్చు. సాధారణంగా తక్కువ లేదా మధ్యస్థ తీవ్రతతో వ్యాయామం చేసే వారికి సాధారణ భోజనం, తగినంత నీరు తీసుకోవడం ద్వారా శరీరం కోలుకోవడానికి అవసరమైన పోషకాలు అందుతాయి. అయితే, ఎక్కువసేపు తీవ్రమైన వ్యాయామం చేసేవారు, వేడి వాతావరణంలో శిక్షణ పొందేవారు, అధికంగా చెమట పట్టేవారు ద్రవాలు, ఎలక్ట్రోలైట్ల అవసరంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి.

# రోజూ కాఫీ తాగుతున్నారా?

## ఈ 5 ఆరోగ్య ప్రయోజనాలు తెలుసుకోండి!



పపంచవ్యాప్తంగా ఉదయం నిద్రలేవగానే చాలామంది ఇష్టంగా తాగే పానీయం కాఫీ. అయితే, కాఫీ కేవలం నిద్రమత్తును తగ్గించి ఉత్సాహాన్ని ఇచ్చే పానీయం మాత్రమే కాదు. ఇందులో ఉండే జీవసంబంధ క్రియాశీల సమ్మేళనాలు పలు తీవ్రమైన ఆరోగ్య సమస్యల ముప్పును తగ్గించడంలో సహాయపడతాయని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా యాంటీ ఆక్సిడెంట్లు, కెఫీన్, ప్రయోజనకరమైన వృక్ష సమ్మేళనాలు కాఫీలో అధికంగా ఉండడం వల్ల పరిమిత మోతాదులో కాఫీ తాగడం కొన్ని ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. హైదరాబాద్‌కు చెందిన క్యాన్సర్ శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ అర్జున్ శంకరన్ తాను ప్రతిరోజూ కాఫీ తాగుతానని ఇన్‌స్టాగ్రామ్ పోస్టులో వెల్లడించారు. తాను క్యాన్సర్ శస్త్రచికిత్స నిపుణుడినని, ప్రతిరోజూ కాఫీ తాగుతానని, ఎక్కువ కాలం జీవించడానికి కాఫీ ఉపయోగపడుతుందని పెద్ద ఎత్తున నిర్వహించిన అధ్యయనాలు సూచిస్తున్నాయని తెలిపారు. కాఫీ వల్ల కలిగే ఐదు ప్రయోజనాలు, అలాగే ఎట్టి పరిస్థితుల్లోనూ ఎలా తాగకూడదో తెలుసుకోండి.. అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

**కాలేయ వ్యాధుల ముప్పును తగ్గించే అవకాశం..**

క్రమం తప్పకుండా కాఫీ తాగేవారిలో ఫ్యాటీ లివర్ వ్యాధి, లివర్ సిరోసిస్ వంటి సమస్యల ముప్పు తక్కువగా ఉంటుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. శరీరంలో దీర్ఘకాలిక వాపును తగ్గించడం, కాలేయంలో కొవ్వు పేరుకుపోవడాన్ని నియంత్రించడంలో కాఫీ సహాయపడుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. కాలేయ వ్యాధుల కారణంగా మరణించే ముప్పు 49 శాతం తక్కువగా ఉంటుందని డాక్టర్ శంకరన్ తన పోస్టులో పేర్కొన్నారు. అలాగే కాఫీలో ఉండే పాలీఫీనాల్స్ అనే సమ్మేళనాలు ఇన్సులిన్ సున్నితత్వాన్ని మెరుగుపరచడంతోపాటు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి. ముఖ్యంగా రెండో రకం మధుమేహం వచ్చే ప్రమాదాన్ని కాఫీ తగ్గిస్తుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి.రోజుకు ఒక కప్పు కాఫీ తాగితే రెండో రకం మధుమేహం వచ్చే ముప్పు 8 శాతం, రెండు కప్పులు తాగితే 15 శాతం, మూడు కప్పులు తాగితే 21 శాతం తగ్గుతుందని డాక్టర్ శంకరన్ పేర్కొన్నారు. అయితే, కాఫీలో చక్కెర కలపడం వల్ల లభించే ప్రయోజనం సగానికి తగ్గుతాయని ఆయన హెచ్చరించారు. ఈ గణాంకాలు అధ్యయనాల్లో గుర్తించిన సంబంధాలను సూచిస్తాయి. ప్రతి ఒక్కరికీ ఇదే స్థాయిలో ప్రయోజనం కలుగుతుందని భావించకూడదు

కాఫీ తాగే మహిళల్లో గర్భాశయ అంతర్గర్భ పొరకు వచ్చే క్యాన్సర్ (ఎండోమెట్రియల్ క్యాన్సర్) ప్రమాదం తక్కువగా ఉంటుందని పరిశోధనలు వెల్లడించాయి. కాఫీలోని యాంటీ ఆక్సిడెంట్లు కణాలను డీఎన్‌ఏ నష్టం నుంచి రక్షించడంలో సహాయపడతాయి. అలాగే శరీరంలో ఈస్ట్రోజెన్ హార్మోన్ జీవక్రియపై కాఫీ ప్రభావం చూపడం ద్వారా రక్తంలో స్వేచ్ఛగా ప్రసరించే ఈస్ట్రోజెన్ స్థాయిలను తగ్గిస్తుందని పరిశోధకులు భావిస్తున్నారు. కాఫీ తాగని వారితో పోలిస్తే, మితంగా లేదా అధికంగా కాఫీ తాగే మహిళల్లో ఎండోమెట్రియల్ క్యాన్సర్ ముప్పు 20 నుంచి 29 శాతం తక్కువగా ఉంటుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

# వ్యాయామం చేస్తే రొమ్ము క్యాన్సర్ ముప్పు తగ్గుతుందా?



। చాలామంది మహిళలు బిజీ జీవితంలో వ్యాయామానికి ముందుగా ప్రాధాన్యం తగ్గిస్తుంటారు. కార్యాలయ పనులు, ఇంటి బాధ్యతలు, కుటుంబ సభ్యుల సంరక్షణ వంటి పనుల మధ్య ఉదయం నడకకు వెళ్లడం కూడా వాయిదా పడుతుంది. ఒకరోజు వ్యాయామం మానేస్తే, అది కొన్నిరోజుల పాటు కొనసాగుతుంది. ఇలా క్రమంగా శారీరక శ్రమకు దూరమవుతుంటారు. అయితే, ఇలా నిరంతరం వ్యాయామం చేయకపోవడం దీర్ఘకాలంలో రొమ్ముల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందా? ముఖ్యంగా రొమ్ము క్యాన్సర్ ముప్పుతో దీనికి సంబంధం ఉంటుందా? ఈ విషయాలను నిపుణులు వివరించారు. రోజుకు ఎంతసేపు వ్యాయామం చేయాలి? పరిశోధనల ప్రకారం, శారీరకంగా చురుకుగా ఉండే మహిళల్లో వ్యాయామం చేయని వారితో పోలిస్తే రొమ్ము క్యాన్సర్ వచ్చే ప్రమాదం తక్కువగా ఉండే అవకాశం ఉంది. అయితే, వ్యాయామం చేస్తే క్యాన్సర్ రాదని హామీ ఇవ్వలేం. అయినప్పటికీ, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి మహిళలు తమ జీవనశైలిలో మార్చుకోగలిగే ముఖ్యమైన అంశాల్లో వ్యాయామం ఒకటి. రోజుకు ఎంతసేపు వ్యాయామం చేయాలి? అది రొమ్ము క్యాన్సర్ ముప్పును తగ్గించడంలో ఎలా తోడ్పడుతుంది? అనే విషయాలు తెలుసుకోవడం ముఖ్యం. ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫారసుల ప్రకారం, పెద్దలు వారానికి 150 నుంచి 300 నిమిషాల పాటు మధ్యస్థ తీవ్రత కలిగిన ఏరోబిక్ వ్యాయామం చేయాలి. లేదా 75 నుంచి చేయాలి. వీటితో పాటు వారంలో కనీసం రెండు రోజులైనా కండరాలను బలోపేతం చేసే వ్యాయామాలు చేయాలని సూచిస్తోంది.

# మన బట్టలు, మన ఇష్టం



బాలీవుడ్‌లో మహిళలపై జరుగుతున్న ట్రోలింగ్ మరియు లింగ వివక్షపై ప్రముఖ నటి కృతి సనన్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కరీనా కపూర్ ఖాన్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న 'వాట్ విమెన్ వాంట్' షోలో పాల్గొన్న ఆమె, తన దుస్తులపై జరిగిన అనవసర రాద్ధాంతం గురించి ఓపెన్‌గా మాట్లాడారు. ఇటీవల ఒక ప్రకటనలో తాను ధరించిన డ్రెస్ జాతీయ స్థాయిలో చర్చనీయాంశం కావడం, ఏకంగా ప్రైమ్‌టైమ్ న్యూస్ డిబేట్లు జరగడం తనను తీవ్రంగా షాక్‌కు గురిచేసిందని కృతి తెలిపారు. సాధారణంగా ఇలాంటి విమర్శలను తాను పట్టించుకోనప్పటికీ, మహిళలను చిన్న విషయాలకే టార్గెట్ చేయడం పెరిగిపోవడంతో స్పందించాల్సి వచ్చిందని పేర్కొన్నారు.
ూx అఅ ంజూశీతీం జఅనవశీ 2ూx అఅ ంజూశీతీం జఅనవశీ 2

మహిళలు ఎలాంటి దుస్తులు ధరించాలనేది పూర్తిగా వారి వ్యక్తిగత స్వేచ్ఛ అని, ఇతరులకు ఆ హక్కు ఎవరిచ్చారని కృతి నిలదీశారు. లావుగా ఉన్నా, సన్నగా ఉన్నా, కాస్త బరువు పెరిగినా బాడీ షేమింగ్ చేయడం, అనవసరమైన కామెంట్లు విసరడం పరిపాటిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా నెగెటివిటీని తట్టుకోలేక కామెంట్ సెక్షన్ ఆఫ్ చేసేయమని సోదరి సలహా ఇచ్చినా, ఎవరికీ భయపడి తాను వెనక్కి తగ్గేది లేదని తేల్చిచెప్పారు. కృతి ధైర్యవంతమైన వ్యాపార వైఖరిని కరీనా కపూర్ ఖాన్ పూర్తిగా సమర్థించారు. చిన్నపాటి శారీరక మార్పులకు కూడా జనం ముందు వివరణ ఇచ్చుకోవాల్సిన దుస్థితి నేడు నెలకొందని ఆందోళన వ్యక్తం చేస్తూ, కృతి స్పందించిన తీరు ఎంతో అభినందనీయమని ప్రశంసించారు.

## సినిమా న్యూస్

## పాకిస్థాన్ ఏజెంట్ ఇండియా వస్తే.. 'ఉడ్తా తీర్'

### పాకిస్థాన్ ఏజెంట్ ఇండియా వస్తే.. 'ఉడ్తా తీర్' రివ్యూ.!

నటీనటులు: ఆయుష్మాన్ ఖురానా, సారా అలీఖాన్, ముకుల్ దేవ్, గుల్షన్ గ్రోవర్, రామ్ కపూర్, రాహుల్ బోస్, బ్రిజేంద్ర కాల్ తదితరులు
దర్శకత్వం, రచన: ఆకాశ్ కౌశిక్
నిర్మాతలు: కరణ్ జోహార్, అదార్ పూనావాలా, గునీత్ మోంగా, అపూర్వ మెహతా, అచిన్ జైన్
విడుదల తేదీ: 23-10-2026
జానర్: స్పై యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్

**కథ**

భారత యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్‌లో విక్రాంత్ (ఆయుష్మాన్ ఖురానా) ఒక కీలకమైన ఏజెంట్. ఉగ్రవాది మసూద్ అజార్ (ముకుల్ దేవ్) దేశంలో అలజడి సృష్టించేందుకు వేసిన పన్నాగాన్ని విక్రాంత్ అడ్డుకుంటాడు. అయితే మసూద్‌ను పట్టుకునే ప్రయత్నంలో విక్రాంత్ సరిహద్దులు దాటి పాకిస్థాన్‌లోకి అడుగుపెడతాడు. అక్కడ ఊహించని విధంగా పాక్ ఆర్మీ అతడిని తమ అత్యంత నమ్మకస్థుడైన ఏజెంట్ 'బిలాల్ అహ్మద్'గా ప్రకటిస్తుంది. తిరిగి భారతదేశానికి వచ్చాక విక్రాంత్ ప్రవర్తనపై ఏటీఎస్ చీఫ్ ఆర్డీ బర్మన్ (రాహుల్ బోస్)కు అనుమానం కలుగుతుంది. సరిగ్గా అదే సమయంలో జరిగిన ఒక కారు ప్రమాదంలో విక్రాంత్ తలకు బలమైన గాయమై తన గతం పూర్తిగా మరచిపోతాడు. పాకిస్థాన్ పన్నిన కుట్ర ఏంటి? గతం మరిచిన ఆ ఏజెంట్ ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నాడు? చివరకు ఏం జరిగిందనేదే ఈ చిత్ర కథ.

**విశ్లేషణ**

ఇటీవల కాలంలో వచ్చిన స్పై థ్రిల్లర్లకు పూర్తి భిన్నంగా, సరికొత్త కామెడీ జోనర్‌లో దర్శకుడు ఆకాశ్ కౌశిక్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. లాజిక్‌ల గురించి ఎక్కువగా ఆలోచించకుండా చూస్తే, ఈ సినిమా మొదటి నుంచి చివరి వరకు చక్కటి వినోదాన్ని పంచుతుంది. సినిమా ప్రారంభం నుంచే కామెడీ డోస్ మామూలుగా ఉండదు. విక్రాంత్ పాక్ ఏజెంట్‌గా మారడం, ఆ తర్వాత రోడ్డు ప్రమాదంలో గతం మరచిపోవడం వంటి సన్నివేశాలు థియేటర్లలో నవ్వులు పూయిస్తాయి. ముఖ్యంగా ఆసుపత్రి ఎపిసోడ్ మరియు పాక్ ఏజెంట్ల గందరగోళం ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయి. సెకండాఫ్‌లో వినోదం మోతాదు కొద్దిగా తగ్గి, కథ సీరియస్ టర్న్ తీసుకుంటుంది. హీరోకి గతం గుర్తుచేయడానికి జరిగే ప్రయత్నాలు కొన్ని చోట్ల ఫస్ట్ హాఫ్ సీన్లను రిపీట్ చేసిన భావన కలిగిస్తాయి. హీరో, భార్య యమున (సారా అలీఖాన్) మధ్య వచ్చే లవ్ ట్రాక్ కొద్దిగా సాగదీసినట్లు అనిపిస్తుంది. ప్రీ-క్లైమాక్స్‌లో వచ్చే ఊహించని ట్విస్ట్ కథకు మంచి ముగింపునిస్తుంది. దర్శకుడు ఈ సినిమాను ఒక సీరియస్ యాక్షన్ డ్రామాగా కాకుండా పూర్తి స్థాయి ఎంటర్‌టైనర్‌గా మలచడంలో సఫలమయ్యారు.

**నటీనటులు**

గతం మరిచిన ఏజెంట్‌గా ఆయుష్మాన్ ఖురానా తన అద్భుతమైన టైమింగ్‌తో సినిమాను తన భుజాలపై మోశారు. నవ్వులు పంచుతూనే యాక్షన్ సీన్లలోనూ ఆకట్టుకున్నారు. ఉగ్రవాది పాత్రలో ముకుల్ దేవ్ నవ్వులు పూయించారు. రాహుల్ బోస్, సారా అలీఖాన్ తమ పరిధి మేరకు చక్కటి నటన కనబరిచారు.




## సైనికుడిగా గోపీచంద్
# పవర్‌ఫుల్ లుక్..

మాచో స్టార్ గోపీచంద్ ప్రస్తుతం 'సింగ' అనే యాక్షన్ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఈ చిత్రంతో ప్రముఖ యాక్షన్ కొరియోగ్రాఫర్ వి. వెంకట్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 'సింగ' సినిమా చిత్రీకరణ శరవేగంగా కొనసాగుతోంది. ఇప్పటికే సినిమా షూటింగ్ 50 శాతం పూర్తయినట్లు చిత్రబృందం వెల్లడించింది. దీంతో ఈ ప్రాజెక్టుపై సినీ ప్రేక్షకుల్లో ఆసక్తి పెరుగుతోంది. గోపీచంద్ గతంలో విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో ఆయన దూకుడైన రూపంతో ఆకట్టుకోగా, తాజాగా విడుదలైన పోస్టర్ మరో ప్రత్యేకతను సంతరించుకుంది.తాజా పోస్టర్‌లో గోపీచంద్ సైనికుడి పాత్రలో కనిపిస్తూ పవర్‌ఫుల్ లుక్‌తో ఆకట్టుకుంటున్నారు. ఆయన పాత్రలోని ఎమోషన్, యాక్షన్ నేపథ్యం సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. ఈ చిత్రంలో గోపీచంద్ పాత్ర ఎలా ఉండబోతోంది? కథలో ఎలాంటి మలుపులు ఉంటాయి? అనే విషయాలపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఈ సినిమాతో అనార్కలి నాజర్ టాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు సామ్ సీఎస్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఉత్కంఠభరితమైన యాక్షన్ సన్నివేశాలు, ఆసక్తికరమైన కథాంశం, భావోద్వేగాలతో కూడిన నాటకీయ అంశాలతో ప్రేక్షకులకు మంచి థియేట్రికల్ అనుభూతిని అందించడమే లక్ష్యంగా చిత్రబృందం పనిచేస్తోంది.దర్శకుడిగా వి. వెంకట్‌కు ఇది తొలి సినిమా కావడం, గోపీచంద్ సైనికుడి పాత్రలో కనిపించనుండటంతో 'సింగ'పై ఆసక్తి నెలకొంది. సినిమా విడుదల తేదీతో పాటు ఇతర వివరాలను చిత్రబృందం త్వరలో ప్రకటించే అవకాశం ఉంది.







# విజువల్ ఎఫెక్ట్స్ పనులు..

యువ నటుడు నిఖిల్ కెరీర్‌లో మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌గా తెరకెక్కుతున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'స్వయంభూ' ఈ సినిమా విడుదల కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రం కోసం నిఖిల్ తన శారీరక రూపాన్ని పూర్తిగా మార్చుకోవడంతో పాటు, ప్రత్యేక శిక్షణ తీసుకుని పాత్రకు తగిన మేకోవర్‌పై భారీగా సమయం కేటాయించారు. అత్యున్నత ప్రమాణాలతో, భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ సుమారు 150 రోజుల పాటు సాగింది. అయితే రెండేళ్ల క్రితమే షూటింగ్ పూర్తయినప్పటికీ, ఈ సినిమా ఇప్పటివరకు ప్రేక్షకుల ముందుకు రాకపోవడం సినీ వర్గాల్లోనూ, అభిమానులలోనూ చర్చనీయాంశంగా మారింది.వాస్తవానికి 'స్వయంభూ' విడుదలకు సంబంధించి గతంలో పలు తేదీలను పరిశీలించినప్పటికీ, వివిధ కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చింది. ఈ చిత్రానికి అత్యంత కీలకమైన విజువల్ ఎఫెక్ట్స్ పనులు అనుకున్న సమయానికి పూర్తికాకపోవడమే ఈ ఆలస్యానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. భారీ విజువల్స్‌తో కూడిన ఈ పాన్ ఇండియా చిత్రాన్ని ఎక్కడా రాజీ పడకుండా, అత్యుత్తమ క్వాలిటీతో ప్రేక్షకులకు అందించాలనే పట్టుదలతో మేకర్స్ ఉన్నారు. మరోవైపు, రాబోయే నెలల్లో బాక్సాఫీస్ బరిలో పలు పెద్ద సినిమాలు నిలుస్తుండటంతో 'స్వయంభూ' చిత్రానికి సరైన సోలో రిలీజ్ డేట్‌ను ఫిక్స్ చేయడం చిత్రబృందానికి కొంత సవాల్‌గా మారింది. ఇప్పటికే పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న నిఖిల్, ఈ సినిమాతో మరోసారి తన సత్తా చాటాలని గట్టి పట్టుదలతో ఉన్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు తుది దశకు చేరుకున్న నేపథ్యంలో, త్వరలోనే చిత్రబృందం సినిమా విడుదల తేదీపై అధికారిక ప్రకటన ఇస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు.

## ఓటీటీలో నాని 'ది ప్యారడైజ్' సంచలనం..

### 48 గంటల్లోనే రికార్డు స్థాయి వ్యూస్!




నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటించిన 'ది ప్యారడైజ్' సినిమా ఓటీటీలో దూసుకుపోతోంది. థియేటర్లలో మిశ్రమ స్పందనను అందుకున్న ఈ చిత్రం, డిజిటల్ వేదికపై మాత్రం ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైన తర్వాత ఈ సినిమా భారీ స్థాయిలో వ్యూస్ సొంతం చేసుకుంది. విడుదలైన కొద్ది సమయంలోనే నంబర్ వన్ స్థానాన్ని అందుకుని, మరో రికార్డు సృష్టించినట్లు చిత్ర వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. 'ది ప్యారడైజ్' ఓటీటీలోకి వచ్చిన 48 గంటల్లోనే విశేషమైన ఆదరణ పొందింది. నెట్‌ఫ్లిక్స్‌లో వేగంగా నంబర్ వన్ స్థానానికి చేరుకున్న చిత్రంగా నిలిచింది. అంతేకాకుండా, ఈ వేదికపై భారతీయ సినిమాలకు సంబంధించి ఒకే రోజులో అత్యధిక వ్యూస్ సాధించిన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది.ప్యారడైజ్ చిత్రానికి శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహించారు. ఆయన గతంలో తెరకెక్కించిన సినిమాల తరహాలోనే 'ది ప్యారడైజ్'లోనూ కథనం, పాత్రల రూపకల్పన, సన్నివేశాల వెనుక ఉన్న భావాలను ప్రేక్షకులు విశ్లేషిస్తున్నారు. థియేటర్లలో సినిమా చూసిన ప్రేక్షకులు ఒక విధంగా స్పందించగా, ఇప్పుడు ఓటీటీలో చూసినవారు కథలోని కొన్ని అంశాలను మరో కోణంలో అర్థం చేసుకుంటున్నారని చెప్పవచ్చు. ముఖ్యంగా దర్శకుడు కథను తెరకెక్కించిన విధానం, సన్నివేశాలను రూపొందించిన తీరు గురించి పలువురు చర్చిస్తున్నారు. నాని తన సహజమైన నటనతో ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. 'ది ప్యారడైజ్'లో ఆయన పోషించిన పాత్ర కూడా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. సినిమాలోని కీలక సన్నివేశాలు, నాని నటనకు సంబంధించిన క్లిప్పులు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

Printed by HAMARA WARANGAL PRINTERS AND GRAPHICS Published by GUNDLA SRINIVAS on behalf of GUNDLA SRINIVAS, printed at WARANGAL and published at H-NO: 2-55, PEDDAPUR VENKATAPUR MANDAL, PEDDAPUR, WARANGAL, TELANGANA - 506168. editor CHENNA RAMA KRISHNA.9573317147,8096914960